Follow: @ANNTELUGU

04-09-2025

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 271 పేజీలు-08 వెల-రూ.6


PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

# కారులో.. కవిత కల్లోలం

## కేసీఆర్‌ను అడ్డుపెట్టుకుని సంపాదించిన వారి గుట్టు రట్టు

## సంతోష్.. నకిలీ ఛాలెంజ్ వెనుక కుట్ర ఇదే

- పోచంపల్లి శ్రీనివాసరెడ్డి రూ.750కోట్ల విల్లా ప్రాజెక్టు ఎలా చేస్తాడు?
- సామాన్యుడికి.. ఇన్ని వందల కోట్లు ఎక్కడివి?
- ..సంతోష్ రావు వల్లే.. కేటీఆర్ కు చెడ్డపేరు
- చిరంజీవి, ప్రభాస్ నే మోసం చేశాడు..
- దొంగజీవోలతో ఫారెస్ట్ లాండ్ లు కొట్టేసే కుట్ర
- నాన్నా.. అన్న.. హరీష్ తో జాగ్రత్త..
- ఆయన ట్రబుల్ షూటర్ కాదు.. క్రియేటర్
- హరీష్ రేవంత్ కాళ్ళుమొక్కి సరెండర్ అయ్యాడు
- హరీష్, సంతోష్ వెనుక రేవంత్ ఉన్నాడు
- కవిత సంచలనాలు.. ఎమ్మెల్సీ పదవికి గుడ్ బై



(హైదరాబాద్-మహా)

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను సస్పెండ్ చేసిన తర్వాత మీడియా సమావేశంలో సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా హరీశ్‌రావు, సంతోష్‌రావు ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన ఆరోపణలు చేశారు. సంతోష్‌రావు గురించి పెద్దగా చెప్పుకునేంత సీన్ లేదంటూనే పలు ఆరోపణలు చేశారు. సంతోష్ రావు మెయిన్ స్ట్రీమ్ మీడియాను మేనేజ్ చేస్తారన్నారు. రామన్నను రిక్వెస్ట్ చేస్తున్న మీరు కూడా ఆ స్కిల్ నేర్చుకోమని సూచించారు. సంతోష్‌రావు కూరల ఉప్పులాంటోడు అన్న కవిత అన్ని చెడగొట్టడానికే ఉంటాడన్నారు. సంతోష్‌రావు ధనదాహం ఎలాంటిదంటే నేరెళ్లలో ఇసుక లారీ గుద్ది ఒక దళిత బిడ్డ చనిపోతే ఇక్కడి నుంచి ఫోన్ చేసి పోలీసులను ఒత్తిడి చేసిఏడుగురు దళిత బిడ్డల్ని కొట్టించాడని ఆరోపించారు. మూడునాలుగు సార్లు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. దానితో వారి కుటుంబాలు ఏం పని చేసుకోలేని

మిగతా 2లో

## టాప్ న్యూస్

### కేసీఆర్ వదిలిన బాణమే కవిత

- వారి కుటుంబంలో ఇది కొత్త నాటకం
- పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

02



### కాళేశ్వరం స్కాంపై డైవర్షన్

- కవిత మాటలన్నీ బీఆర్ఎస్ డ్రామా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు


02



### కవిత సస్పెండ్.. ఓ పెద్ద పొలిటికల్ డ్రామా

- నలుగురు కుటుంబ సభ్యులను కూర్చొబెట్టి కేసీఆర్ సర్దుబాటు చేయలేడా?
- నన్ను ఓడించేందుకు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వందల కోట్లు ఖర్చు చేశారు
- మీడియా చిట్ చాట్‌లో మంత్రి సీతక్క హాట్ కామెంట్స్

02







మీ కుటుంబ పంచాయితీలోకి..

# మమ్మల్ని లాగొద్దు

## ఆ చెత్తగాళ్ళ వెనుక నేనెందుకుంట



- రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి పొంగులేటి సమర్ధుడు కాబట్టే ఇళ్ళ శాఖ అప్పగించాం
- బీఆర్ఎస్ కు దమ్ముంటే స్థానిక ఎన్నికల్లో మాకన్నా ఎక్కువసీట్లు గెలవండి
- పాలమూరు, భద్రాద్రి జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, మహా :** భారత రాష్ట్ర సమితి నేతలను ప్రజలు తిరస్కరించారని, అలాంటి వారి వెనుక తాను ఎందుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావు వెనుకాల రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని మరో రెండున్నరేళ్లలో మరో నాలుగు లక్షల ఇండ్లు ఇస్తామని ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2లో





## త్వరలో మరో ఉపఎన్నిక

నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్సీ ఖాళీ

కాంగ్రెస్ నేతల చూపు

వివరాలు 3లో

## ప్రజాశాంతి పార్టీలోకి రండి

- బీజేపీ పంపిన బాణం కాదని రుజువు చేసుకో
- కవితకు ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ ఆఫర్
- జూబ్లిహిల్స్ నుండి పోటీ చేయండి



**హైదరాబాద్, మహా:** కల్వకుంట్ల కవితకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆఫర్ ఇచ్చారు. ప్రజాశాంతి పార్టీలోకి కవితను ఆహ్వానించారు. కవితను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఆయన ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశారు. 'కేసీఆర్ కూతురు కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు.

మిగతా 2లో

## సామాన్యులకు గుడ్ న్యూస్

ఇకపై రెండు జీఎస్టీ స్లాబులే

- 22వ తేదీ నుంచి అమల్లోకి
- వ్యవసాయం, వైద్య రంగానికి ఊరట
- రైతులు, సామాన్య ప్రజల్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు :నిర్మలా సీతారామన్



**ఢిల్లీ, మహా:** జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ స్లాబ్ రేట్లను అమలు చేయాలని నిర్ణయించారు. ఇకపై జీఎస్టీలో రెండు స్లాబ్‌లు (5, 18 శాతం) మాత్రమే కొనసాగించనున్నారు.

మిగతా 3లో

## కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు స్వర్ణయుగం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- కేసీఆర్ పై సీబీఐ విచారణ జరపాలనుకోవడం సిగ్గుచేటు
- బీఆర్ఎస్ లో చేరిన మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రావు

**గజ్వేల్, మహా :** మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లతో రాబోయే 50 ఏండ్ల హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చిన దార్శనికుడు కేసీఆర్ పై సీబీఐ విచారణ జరపడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీబీఐని మోడీ జేబు సంస్థ అని రాహుల్ విమర్శిస్తే, రేవంత్

మిగతా 2లో



SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు


| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,06,090 |
| 22 క్యారెట్ | 97,250 |
| సిల్వర్ (కేజీ) | 1,26,100 |

## కవిత ఆరోపణలపై వెంటనే విచారణ జరపాలి

- పోచంపల్లి, నవీన్ రావు, సందీప్ రావు అరాచకాలపై విచారించాలి
- సందీప్ రావు ద్వారా సంతోష్ రావు సెటిల్ మెంట్లు
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఫైర్

02





## మీ కుటుంబ పంచాయితీలోకి..

# మమ్మల్ని లాగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలోని చంద్రుగొండలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచే మొదలైందని గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు కాంగ్రెస్‌ను ఎప్పుడూ ఆదరించారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదల సొంతింటి కల నెరవేరలేదని విమర్శించారు. అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం.. ఎక్కడా చిన్న అవకతవలకు తావు లేకుండా చూస్తున్నామని అన్నారు. నిజమైన లబ్ధిదారులు అందరికీ న్యాయం చేస్తున్నామని చెప్పారు.

**పొంగులేటి సమర్థుడు కాబట్టే**

ధరణి పోర్టల్ లాంటి కొరివి దయ్యాన్ని పారదోలడానికే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ శాఖ ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బాధ్యతలకు కూడా ఆయనకే ఇచ్చామని తెలిపారు. సమర్థుడు కాబట్టే పొంగులేటికి ఇన్ని కీలకమైన శాఖలు అప్పగించామని చెప్పారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. తెలంగాణలో హనుమాన్ గుడి లేని గ్రామం అయినా ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం లేదని చెప్పారు. అయినా కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే పనిగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టినా వారిలో మార్పు రావడం లేదని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ వారికి ప్రజలు బుద్ధి చెబుతారని.. బీఆర్ఎస్ నేతలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలా కాకుండా బీఆర్ఎస్ నేతలు ఊహించినట్లుగా స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అధిక సీట్లు వస్తే తానే స్వయంగా కేసీఆర్‌కు స్వయంగా సారీ చెబుతానని కీలక ప్రకటన చేశారు. దమ్ముంటే స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలిచి చూపించాలని సవాల్ చేశారు.

**పాలమూరును ఉన్నతస్థానంలో నిలబెడతా**

రాబోయే రోజుల్లో మహబూబ్ నగర్ జిల్లాకు నూతన పరిశ్రమలకు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కరవు, కాటకాలతో అల్లాడుతున్న ఉమ్మడి పాలమూరు పేదరికాన్ని పరిశీలించడానికి విదేశాల నుంచి బృందాలు వచ్చే పరిస్థితి నుంచి జిల్లాను సమున్నత స్థానంలో నిలబెట్టడం తన నైతిక ధర్మమని పేర్కొన్నారు. దశాబ్దాల కరవు, వెనుకబాటుతనం,



వలసల నుంచి బయటపడేందుకు ముఖ్యమంత్రి రూపంలో దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్య, నీటి పారుదల, ఉద్యోగ ఉపాధి రంగాల్లో ఉమ్మడి పాలమూరును ఉన్నత స్థానంలో నిలబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని వేముల గ్రామంలో ప్రఖ్యాత ఎస్‌జీడీ కార్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన నూతన యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ పరిశ్రమల స్థానిక యువతకే కాదు, రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ జిల్లా వేదిక కాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

**నిధుల విషయంలో వెనకడుగు వేసేది లేదు..**

'పాలమూరు జిల్లా అంటే ఒకనాడు వలసలకు మారుపేరు. దేశంలో ఎక్కడ ఏమూలన ప్రాజెక్టులు కట్టినా వాటి నిర్మాణాల్లో పాలమూరు కూలీలు భాగస్వాములయ్యారు. విద్యావకాశాలు, నీటి వసతులు లేని కారణంగా పాలమూరు బిడ్డలు కూలీలుగా దేశం నలుమూలలకు వలసపోయేది. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి ఎత్తిపోతల, జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, బీమా వంటి ఏ ప్రాజెక్టులూ పూర్తికాలేదు. ఆనాడు సోనియా గాంధీ గారు పాలమూరు యూనివర్సిటీని మంజూరు చేసినా, దానికి ఇంజనీరింగ్ కాలేజీగానీ, లా కాలేజీ గానీ లేని కారణంగా అది పీజీ కాలేజీ స్థాయిలోనే మిగిలిపోయింది. మొదటి హైదరాబాద్ రాష్ట్రానికి బూర్గుల రామకృష్ణా రావు తర్వాత 70 ఏండ్లకు మళ్లీ పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాడు. ఈనాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శషభిషలకు తావులేకుండా, జిల్లాకు బాసర తర్వాత రెండో ట్రిపుల్ ఐటీని ఈ జిల్లాలో ఏర్పాటు చేశాం. ఇంజనీరింగ్, లా, మెడికల్ కాలేజీ వచ్చినా, వెనుకబడిన ఈ ప్రాంతంలో, ఇక్కడి పేద పిల్లలకు అందుబాలోకి తేవాలని ప్రయత్నిస్తున్నాం. పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరుచేశాం. మొదటి యంగ్ ఇండియా స్కూలుకు షాద్‌నగర్‌లోనే శిలాఫలకం వేశాం. వలసలు పోయే మనం, మన తలరాతలను మార్చుకోవాలి. మన తలరాతను మార్చేది విద్య మాత్రమే. పాలమూరు జిల్లా నుంచి పిల్లలు విద్యా రంగంలో పైకి రావాలి. ఎదగాలంటే చదవాలి, చదవాలంటే వసతులు పెరగాలి. ఆ బాధ్యత నేను తీసుకుంటా. విద్యకు నిధులు అందించడంలో వెనుకడుగువేసేది లేదు.

**కడుపులో కత్తులు పెట్టుకుని..**

గ్రీన్ ఛానెల్‌లో నిధులు కేటాయించి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయించే ప్రయత్నం చేస్తున్నాం. ఉద్ధండాపూర్, మక్తల్ నారాయణపేట్, కొడంగల్ ప్రాంతాలకు నీళ్ల కోసం 2014లోనే జీవో 69 ద్వారా ప్రాజెక్టును తెచ్చుకుంటే, గత పాలకులు పదేండ్లు ఆ ప్రాజెక్టును అడ్డుకున్నారు. ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు. ఆ ప్రాజెక్టును ఇప్పుడు ముందుకు తీసకెళుతుంటే గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి. మంత్రిగ పది రోజులు టైమ్ తీసుకొని రైతులతో మాట్లాడాలి. భూమి కోల్పోయే ప్రతి రైతును పిలిచి మాట్లాడాలి. వారికి న్యాయం చేద్దాం. కలెక్టర్ ద్వారా అండర్ టేకింగ్ ఇప్పించాలి. పాలమూరు రైతాంగానికి నష్టం జరిగితే నాకు, నా మంత్రులు, ఎమ్మెల్యేలకు నష్టం జరిగినట్లే. మీకు న్యాయం చేసే బాధ్యత నాది. బ్రహ్మోస్ మిస్సైల్ ఇక్కడ ఉత్పత్తి చేస్తే, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. రెసిడెన్షియల్ స్కూళ్లతో పాటు, ఏటీసీలు అందుబాటులోకి తెచ్చి, యువతకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఏటీసీలు ఉండాల్సిందే. తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. పాలమూరు పేదరికాన్ని ప్రదర్శనగా చూపడం కాదు. ఇక్కడి అభివృద్ధిని, విద్యా సంస్థలను, సాగునీటి ప్రాజెక్టులను చూడటానికి విదేశీ బృందాలు రావాలి' అని అన్నారు. కుర్చీలో కూర్చున్న ప్రతి నాయకుడు.. ఆయనను నమ్ముకున్న ప్రజలకు మొదటి ముద్దను పెట్టాలని రేవంత్ పేర్కొన్నారు. తనకు ఏ అవకాశం వచ్చినా.. మొదటి ముద్ద పాలమూరుకు పెడతా అని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండకూడదని చూసిన వారు.. ఇప్పుడు వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని.. కౌగిలించుకుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.

**కాలం చెల్లిన వెయ్యి నోటు..**

తాను హరీష్ రావు, సంతోష్ రావు వెనకాల ఉన్నానని ఒకరు, కవిత వెంట ఉన్నానని మరొకరు అంటున్నారని.. ఎవరి వెనకాల తాను ఎందుకు ఉంటా.. అని ప్రశ్నించారు. తాను ప్రజల అభివృద్ధి కోసం ముందు ఉంటానని వివరించారు. ఒకప్పుడు జనతా పార్టీ చాలా ఫేమస్.. కాల గర్భంలో కలిసిపోయిందని గుర్తుచేశారు. ఏ పార్టీ, ఎవరు శాశ్వతం కాదని హితవు పలికారు. పాపం ఎప్పుడూ ఊరికే పోదని నొక్కిచెప్పారు. ఇప్పటికే బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని, ప్రజలు తిరస్కరించిన వారి వెనుక తానెందుకు ఉంటాను? అని ప్రశ్నించారు. అంత చెత్త మనుషుల వెనుక తానెందుకుంటానని, దిక్కుమాలినోళ్ల వెనుక బుద్ధి ఉన్నవాడు ఎవడైనా ఉంటారా? అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇంత పనికిమాలినోళ్లతో కలిసే సమయం తనకు లేదని, మీరు కాలం చెల్లిన వెయ్యి నోటు వంటివారని అన్నారు. ఇన్ని దుర్మార్గాలు చేసిన మీరు ఎలా మనుగడ సాగిస్తారు? అని సీఎం ప్రశ్నించారు. తాను ప్రజల వెంట మాత్రమే ఉంటానని, మీ కుల, కుటుంబ పంచాయితీల మధ్య తమను తీసుకురావద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు వచ్చి విభేదాలు వచ్చాయని పరోక్షంగా కవితను ఉద్దేశించి అన్నారు.

# కారులో.. కవిత కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి నెలకొంది అన్నారు. అదంతా రామన్న మెడకు చుట్టుకుందన్నారు. నేరం చేసింది సంతోష్ అయితే రామన్న పేరు బదనాం అయిందన్నారు. రేవత్ రెడ్డితో అండర్‌స్టాండింగ్ ఉండటం వల్లే టానిక్ లాంటి కేసులు మూసేసరని కవిత ఆరోపించారు.

**కేసీఆర్ కు పోటీగా నకిలీ ఛాలెంజ్**

తెలంగాణకు హరితాహారం అని పెద్దలు కేసీఆర్ 230 కోట్లతో పెద్ద కలతో కార్యక్రమం చేపట్టారన్నారు. దానికి పోటీగా ఈయన గ్రీన్ ఇండియా అని మొదలు పెట్టారన్నారు. తెల్లారి లేస్తే సినిమా వాళ్లను తీసుకురావాలి, ఫోటోలు వేసుకోవాలి అంతే. దానివెనుక ఉన్న కుట్ర ఎందంటే జీవో అనౌన్స్‌మెంట్ అవుతుందని తెలిపారు. 10 పర్సెంట్ ఇన్‌కం ఇస్తే అమ్యూజ్‌మెంట్ పార్కులకు ఇస్తారన్నారు. దానికి చిరంజీవి, ప్రభాస్ వంటి అనేక మంది సినిమా స్టార్లను మోసం చేసి వాళ్లను తీసుకుపోయి వాళ్లతోని పోటోలకు ఫోజులు ఇప్పించుకున్నారన్నారు. తద్వారా ఫారెస్టులను కొట్టేయ్యాలని ప్లాన్ అని ఆరోపించారు కవిత.

**పోచంపల్లి, కుర్మ నవీన్ తో కలిసి వసూళ్ళ గ్యాంగ్**

ఇగ సంతోష్ రావుకు ఇద్దరు ముగ్గురు మనుషులు ఉంటారని ఒకరు పోచంపల్లి శ్రీనివాస రెడ్డి, మరోకరు నవీన్‌కుమార్ అని కవిత అన్నారు. శ్రీనివాసరెడ్డిది వరికోల్ అనే ఊరు. ఆయనది సామాన్య మధ్యతరగతి కుటుంబం. కానీ ఇప్పుడు ఆయనను శ్రీమంతుడు అంటారన్నారు. మోకిలాలలో మేఘా శ్రీనివాసరెడ్డితో కలిసి 750 కోట్ల విల్లా ప్రాజెక్టు చేస్తున్నారని తెలిపారు. అన్ని డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయ ని ప్రశ్నించారు. అవినీతి డబ్బులు కాదా అని ఎద్దేవా చేశారు. సంతోష్‌రావు క్లాస్‌మెట్. అది తప్ప ఆయనకున్న అర్హత ఏం లేదు. ఆయనకు ఎమ్మెల్సీ వస్తది, కాంట్రాక్టులు వస్తాయి అని బాంబ్ పేల్చారు.ఈ విషయం పల్లా రాజేశ్వరరెడ్డి అన్ననే చెప్పిండు డౌట్ ఉండే ఆయనను అడగొచ్చు అన్నారు.

ఇక నవీన్ రావు మరో ఎమ్మెల్సీ అయన డైరెక్టుగా మామోహం పట్టుకుని నాకు ఎమ్మెల్సీ ఇచ్చింది కేసీఆర్ అయిన నాకు దేవుడు సంతోష్ అంటడు.నిన్న మొన్న వాళ్ల నాన్న ను పేకాటల పట్టుకున్నరు. ఏమయింది కేసు నవీన్ రావు పోయి రేవంత్ కాళ్లు పట్టుకున్నట్లు తెలిసింది. దీంతో ఆయన తండ్రిని ఇడిసిపెట్టారు. ఆయన మీద భూకబ్జా కేసులు ఉంటే అవి వదిలేశారన్నారు.

**ఓ పక్క హరీష్ గ్యాంగ్.. ఇంకో పక్క సంతోష్ గ్యాంగ్**

ఒక పక్క హరీశ్‌రావు గ్యాంగ్, మరోపక్క సంతోష్ రావు గ్యాంగ్ పైనున్న బీజేపీ తో కో ఆర్డినేషన్‌లో ఉండి బీఆర్ఎస్ పార్టీని జలగల్లాగ పట్టిపీడిస్తున్నారని ఆరోపించారు.నిరంతరం పార్టీకి నష్టం చేస్తున్నారన్నారు. నిజామాబాద్‌లో తనపై కుట్ర చేసి ఓడించారని, కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించారన్నారు.మూడో సారి ప్రభుత్వం ఓడిపోయే వరకు వచ్చిందన్నారు. సంతోష్‌రావు బాధితులు తనకు ఫోన్ చేస్తున్నారని కవిత తెలిపారు. వాళ్లమీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

# కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు స్వర్ణయుగం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ పై సీబీఐ విచారణ జరపాలనుకోవడం సిగ్గుచేటు

బీఆర్ఎస్ లో చేరిన మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రావు

(మొదటిపేజీ తరువాయి)

దాన్ని ప్రశంసించడం కాంగ్రెస్ దౌర్భాగ్యస్థితికి నిదర్శనమన్నారు. పినపాక నియోజకవర్గం, మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ రావు, ఆయన అనుచరులు బుధవారం ఎర్రవల్లిలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్, భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు కూడా పదేళ్లలో కేసిఆర్ చేసినంత అభివృద్ధి చేయలేదన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ పచ్చబడుతుంటే కొంతమంది కళ్లు ఎర్రబడుతున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు అనుక్షణం గుర్తు తెచ్చుకుంటుంటే ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీలు కక్షపూరితంగా అక్రమ కేసులతో కేసీఆర్ ను బద్నాం చేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఆగమాగమైందని, ప్రజలంతా కేసీఆర్ పాలననే తిరిగి కోరుకుంటున్నారని కేటీఆర్ చెప్పారు. కేవలం 21 నెలల కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు విసిగిపోయారని, "కేసీఆర్ ఉన్నప్పుడే బాగుంది" అని ప్రతి ఒక్కరూ అంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విరుచుకుపడ్డారు. ఎన్నికలకు ముందు హామీల జాతర, ఎన్నికల తర్వాత చెప్పుల జాతర అన్నట్టుగా రాష్ట్రంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. వ్యవసాయ సొసైటీల ముందు రైతులు చెప్పుల వరుసలు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించిందన్నారు. ఆనాటి దుర్భర రోజులను మళ్లీ తీసుకొస్తా అని చెప్పి రేవంత్ తెలంగాణ ప్రజలను నిజాయితీగా మోసం చేశాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2014లో వ్యవసాయ దిగుబడుల్లో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను, కాళేశ్వరం, సీతారామ, పాలమూరురంగారెడ్డి వంటి ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేసి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది అన్నారు కేటీఆర్. సముద్ర మట్టానికి 80 మీటర్ల ఎత్తున ఉన్న మేడిగడ్డ నుంచి 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌కు రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించే అద్భుతమైన, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అన్నారు. ఈ ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాలకు సాగునీరు, ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు.

# కాళేశ్వరం స్కాంపై డైవర్షన్

## కవిత మాటలన్నీ బీఆర్ఎస్ డ్రామా

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్, మహా :** కాళేశ్వరం అవినీతి కేసు సైడ్ ట్రాక్ చేసేందుకే కవిత అంశాన్ని బీఆర్ఎస్ ముందుకు తెచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కవిత మాటలన్నీ బీఆర్ఎస్ డ్రామా అని తేల్చి చెప్పారు. ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అని బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని అంగీకరించిందన్నారు. కరీంనగర్ లో ఏర్పాటు చేసిన బీజేపీ పోలింగ్ బూత్ పై స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన సంజయ్ కాళేశ్వరంపై విచారణ విషయంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతోందన్నారు. అసెంబ్లీలో సీబీఐ విచారణ చేయాలని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టులో మాత్రం సరైన వాదనలు విన్పించకుండా బీఆర్ఎస్ కు రిలీఫ్ వచ్చేలా చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన స్కాంల విషయంలో ఎడతెరిపి లేని విచారణలతో జాప్యం చేస్తూ దోషులు తప్పించుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై నివేదిక వచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశంతోపాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కేసు, గొర్రెల స్కాం కేసులను సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. నక్సలిజం ఫిలాసఫీ అని రేవంత్ రెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి దానికి అనుకూలంగా మాట్లాడటం విడ్డూరమన్నారు. నక్సలైట్లు కాల్చి చంపిన కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులైన శ్రీధర్ బాబు, పర్ణికారెడ్డి నక్సలిజం ఫిలాసఫీని ఆమోదిస్తారా? అని ప్రశ్నించారు. నక్సలైట్ల విషయంలో కేంద్రం చాలా స్పష్టమైన వైఖరితో ఉందని, వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతమొందించి తీరుతామని ఉద్ఘాటించారు.

తెలంగాణలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క పైసా ఇయ్యని ప్రభుత్వం ఈ దేశంలో తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిందని, కేంద్ర నిధుల కోసమే స్థానిక సంస్థలు నిర్వహించాలనుకుంటున్నారన్నారు. ఆ నిధులను దొబ్బి పోవడానికే సీఎం ఈ ఎన్నికలు నిర్వహించబోతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మోదీ నిధులిస్తున్నారు కాబట్టి ఆయన వారసులుగా పోటీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలను గెలిపించాలని ప్రజలను సంజయ్ కోరారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చే లేదని సంజయ్ మండిపడ్డారు. ఇండ్లు లేక జనం అల్లాడుతున్నారని, కేంద్ర నిధులు దారి మళ్లుతున్నాయన్నారు. 6 గ్యారంటీలపై చర్చ లేదు, ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు, ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అయి రోగులు బాధ పడుతున్నారు, ఉద్యోగులు అనేక సమస్యలతో బాధపడుతున్నారు వీటిపై అసలు అసెంబ్లీలో చర్చలే జరగడం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రజల దారి మళ్లించేందుకు అసెంబ్లీలో కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని సంజయ్ విరుచుకుపడ్డారు.

# కవిత సస్పెండ్.. ఓ పెద్ద పొలిటికల్ డ్రామా

నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి కేసీఆర్ సర్దుబాటు చేయలేడా?

నన్ను ఓడించేందుకు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వందల కోట్లు ఖర్చు చేశారు

మీడియా చిట్ చాట్‌లో మంత్రి సీతక్క హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెండ్ ఎపిసోడ్ ఓ పెద్ద రాజకీయ కుటుంబ డ్రామా అని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క అన్నారు. కవిత ఎపిసోడ్ పై సీతక్క మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడారు. కేటీఆర్ ప్రోత్సాహం లేనిది కవితను సస్పెండ్ చేయడం సాధ్యమా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను కవిత వెనకేసుకురావడం పెద్ద డ్రామాగా ఉందన్నారు. మొదట కేటీఆర్ ను టార్గెట్ చేసిన కవిత ఇప్పుడు హరీష్ రావు, సంతోష్ రావులను టార్గెట్ చేశారన్నారు. కేసీఆర్ కుటుంబం అంతా ఒకటేనని.. వారంతా భవిష్యత్తులో అందరూ కలిసి పోతారన్నారు. కవితను విమర్శించిన మహిళా నేతలే నష్టపోతారన్నారు. తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కేసీఆర్ తన కుటుంబ సమస్యను పరిష్కరించుకోలేని బలహీన పరిస్థితుల్లో ఉన్నాడా? అని సీతక్క సెటైర్లు వేశారు. నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి మాట్లాడి సర్దుబాటు చేయలేడా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్



కుటుంబం అవినీతి బయట పడేసరికి ఈ గొడవలను తెరమీదకు తెచ్చారన్నారు. అవినీతి సొమ్ము, అక్రమ సంపాదన పంపకాల్లో వచ్చిన తేడాలతోనే కేసీఆర్ కుటుంబ సభ్యులు గొడవలు పడుతున్నారన్నారు. సంతోష్ రావు బినామీగా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి రూ. వందల కోట్లు సంపాదించారని కవిత ఆరోపించిందన్నారు. ములుగులో నన్ను ఓడించేందుకు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వందల కోట్లు ఖర్చు చేశాడని సీతక్క విమర్శించారు.

# ప్రజాశాంతి పార్టీలోకి రండి

(మొదటిపేజీ తరువాయి)

బీసీల కోసం పోరాడుతానని కవిత చెబుతోంది. కవిత నిజంగా నీవు బీసీల కోసం పోరాడాలంటే... ఇప్పుడు బీసీల కోసం ఉన్న ఏకైక పార్టీ ప్రజాశాంతి పార్టీ. ప్రజాశాంతి పార్టీతో చేయి కలుపు, నువ్వు బీజేపీ పంపిన బాణం కాదని రుజువు చేసుకో. బీజేపీ బ్రాహ్మణుల పార్టీ. కాంగ్రెస్ రెడ్ల పార్టీ. దొరసానివైన నిన్ను ప్రజలు నమ్మాలంటే.. గద్దరన్న చేరిన పార్టీ ప్రజాశాంతి పార్టీలో చేరు. ప్రజాశాంతి పార్టీలోకి రా. జూబ్లీహిల్స్ లో పోరాడుదాం. రుజువు చేసుకుందాం... అందరి మనసులు గెలుచుకుందాం' అంటూ కవితను కేఏ పాల్ ఆహ్వానించారు.





ఎఎన్ఎన్ తెలుగు- మహా పత్రిక కార్యాలయానికి ప్రముఖ నటుడు, మనం సైతం ఫౌండేషన్ చైర్మన్ కాదంబరి కిరణ్ బుధవారం వచ్చారు. ఛానల్ సీఈవో కంది రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ ను అభినందించడంతో పాటు మనం సైతం సేవా కార్యక్రమాలకు ఎఎన్ఎన్ సహకారం ఉంటుందన్నారు.

# కేసీఆర్ వదిలిన బాణమే కవిత

## వారి కుటుంబంలో ఇది కొత్త నాటకం

పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకొని ఇప్పుడు తిట్టుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత చెప్పిన విషయాలన్నీ వాస్తవమేనని, రాష్ట్రంలో పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందన్నారు. "పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు. వాళ్ల పార్టీ లేకుండా వారే చేసుకుంటున్నారు. కవిత ఇన్ని రోజులు బాణాన్ని కేటీఆర్ మీదకు ఎక్కుపెట్టారు. అకస్మాత్తుగా ఆ



బాణాన్ని హరీశ్‌రావు మీదకు తిప్పారు. అమెరికా వెళ్లి వచ్చాక కవిత వైఖరిలో మార్పు కనిపించింది. కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం. కేసీఆర్ కుటుంబంలో ఇది కొత్త నాటకం"అని అన్నారు.

# కవిత ఆరోపణలపై వెంటనే విచారణ జరపాలి

పోచంపల్లి, నవీన్ రావు, సందీప్ రావు అరాచకాలపై విచారించాలి

సందీప్ రావు ద్వారా సంతోష్ రావు సెటిల్ మెంట్లు

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఫైర్

**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దుబ్బాకకు మీ కుటుంబం చేసిన అన్యాయం గురించి తాను అనేక సార్లు చెప్పానన్నారు. అలాగే దుబ్బాకు హరీష్ రావు వల్లే అన్యాయం జరిగిందని కూడా తాను ఆనాడే చెప్పానని తెలిపారు. బీఆర్ఎస్‌లో తాను ఓడిపోవడానికి కారణం ఏమిటో కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గతంలోనే చెప్పానన్నారు. ఒకే విమానంలో సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులు ప్రయాణం చేశారని తాను గతంలోనే చెప్పానని పేర్కొన్నారు. అయితే కవిత చెప్పిన దాంట్లో కొత్తదనం ఏమీ కనిపించడం లేదన్నారు. మోకిల్లాలో జరుగుతున్న విల్లా ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రావులపై వెంటనే ఏసీబీ డీజీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సూచించారు. గతంలో నార్సింగి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సందీప్ రావు చేసిన అరాచకాలు చెప్పాల్సి ఉండేదన్నారు. సంతోష్ రావు వియ్యంకుడి హోదాలో మాత్రమే సందీప్ రావు అనేక అరాచకాలు చేశారని వివరించారు. అతడి ద్వారానే సంతోష్‌రావు సెటిల్‌మెంట్లు చేసేవారన్నారు.

# సామాన్యులకు గుడ్ న్యూస్

ఇకపై రెండు జీఎస్టీ స్లాబులే..

- 22వ తేదీ నుంచి అమల్లోకి
- వ్యవసాయం, వైద్య రంగానికి ఊరట
- రైతులు, సామాన్య ప్రజల్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు : నిర్మలా సీతారామన్




(మొదటిపేజీ తరువాయి)

జీఎస్టీలో ప్రస్తుతం కొనసాగుతోన్న 12, 28శాతం స్లాబ్‌లు తొలగించాలని నిర్ణయించారు. విలాస వస్తువులపై 40 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీడియాతో మాట్లాడారు. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని తెలిపారు. జీఎస్టీలో రెండు స్లాబ్‌లు మాత్రమే కొనసాగించాలని నిర్ణయించామన్నారు. ముఖ్యంగా రైతులు, సామాన్య ప్రజల్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. వ్యవసాయం, వైద్య రంగానికి ఊరట కలిగించే నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. జీఎస్టీ ఫైలింగ్‌ను కూడా సరళతరం చేస్తున్నామన్నారు. కొత్త స్లాబ్‌లతో పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలుగుతుందన్న ఆమె.. చాలా ఆహార పదార్థాలపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. పేదలు, సామాన్యులు అధికంగా వాడే వస్తువులపై 5శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. అన్ని టీవీలపై 18శాతం జీఎస్టీ ఉంటుందని చెప్పారు.

- అన్ని రకాల వ్యక్తిగత, జీవిత బీమా ఇన్సూరెన్స్‌లకు జీఎస్టీ నుంచి మినహాయింపు
- వ్యక్తిగత లైఫ్, హెల్త్, టర్మ్ బీమా పాలసీలపై జీఎస్టీ తొలగింపు
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5శాతానికి తగ్గింపు
- చేనేత, మార్బుల్, గ్రానైట్‌పై 5శాతం జీఎస్టీ
- సిమెంట్‌పై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గింపు
- 33 ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీని 12శాతం నుంచి 0కి తగ్గింపు
- 350సీసీ కంటే తక్కువ వాహనాలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు
- ఫెర్టిలైజర్స్, ఎరువులపై జీఎస్టీ 18శాతం నుంచి 5శాతానికి తగ్గింపు
- పాన్ మసాలా, సిగరెట్, గుట్కా, పొగాకు ఉత్పత్తులపై 40శాతం జీఎస్టీ
- పాన్ మసాలా, సిగరెట్, గుట్కా, పొగాకు ఉత్పత్తులపై 40శాతం జీఎస్టీ
- ఫ్రూట్ జ్యూస్ కాకుండా నాన్ ఆల్కాహాలిక్ బ్రేవరేజెస్‌పై 40శాతం పన్ను

# ట్రేడ్ డీల్ వల్లే ఏడు యుద్ధాలను ఆపా..

## ట్రంప్ పాతపాట.. అనారోగ్య వార్తలన్నీ ఫేక్



**మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన టారిఫ్ విధానాన్ని సమర్థించుకున్నారు. కేవలం ట్రేడ్ డీల్‌తోనే ఏడు యుద్ధాలను తానే పరిష్కరించినట్లు పేర్కొన్నారు. టారిఫ్‌ల వల్ల అమెరికాకు గొప్ప చర్చల సామర్థ్యాన్ని అందిస్తుందని తెలిపారు. అమెరికా స్పేస్ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని అలబామాలోని హంట్స్‌విల్లేకు తరలిస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు తన ఆరోగ్యంపై వస్తున్న వార్తలపై కూడా ట్రంప్ స్పందించారు. 'సుంకాలు ఓ మాయా చర్చల సాధనం. సుంకాలు పెంపు అమెరికా ఆర్థిక వ్యవస్థకే కాకుండా ఏడు యుద్ధాలను పరిష్కరించడానికి సహాయపడింది. అమెరికా చాలా పెద్ద, అలాగే శక్తిమంతమైన దేశం. అమెరికా లేకపోతే ప్రపంచంలో ఏది ఉండదు. మొదటి నాలుగు సంవత్సరాల్లో అమెరికా శక్తిమంతమైన దేశంగా చేశా. కానీ ఆ తర్వాత వచ్చిన జో బైడెన్ సర్కార్‌తో క్షీణించడం ప్రారంభమైంది. టారిఫ్‌లు మా దేశాన్ని ఆర్థికంగా అత్యంత శక్తివంతంగా మార్చాయి. మేం ఇప్పటి వరకు ఊహించని స్థాయికి చేర్చాం. ప్రపంచంలో మేం ఉత్తమం. అలాగే వేగంగా ఎదుగుతున్న దేశం. టారిఫ్‌ల వల్లనే ఇది సాధ్యమైంది. నేను ఏడు యుద్ధాలను పరిష్కరించా. వాటిలో చాలా యుద్ధాలు వాణిజ్యం కారణంగానే జరిగాయి.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అవన్నీ ఫేక్ న్యూస్ : ట్రంప్**

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చనిపోయారంటూ ఇటీవ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. డొనాల్డ్ ట్రంప్ దీనిపై స్పందిస్తూ అవన్నీ ఫేక్ న్యూస్ అంటూ కొట్టిపారేశారు. మీరు చనిపోయారంటూ వస్తున్న వార్తలు మీ దృష్టికి వచ్చాయా అని తాజాగా ట్రంప్‌ను ఓ రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి లేదు, తన ఆరోగ్యంపై వదంతులు వచ్చాయని మాత్రమే విన్నట్లు అని ట్రంప్ బదులిచ్చారు. 'నేను చనిపోయాని ప్రజలు ఆలోచిస్తున్నారని నాకు తెలియదు. కానీ ఆరోగ్యం గురించి ఆందోళనలు ఉన్నాయని విన్నా. వారు ట్రంప్ బాగానే ఉన్నారా? ఎలా ఉన్నారు? అనే అంటున్నారు. ఆ ఊహాగానాల అన్ని నకిలీ వార్తలే. నేను చాలా చురుగ్గా ఉన్నా' అని ట్రంప్ పేర్కొన్నారు.

# త్వరలో మరో ఉపఎన్నిక




## నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్సీ ఖాళీ

కాంగ్రెస్ నేతల చూపు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఎమ్మెల్సీ స్థానానికి మరో ఉప ఎన్నిక జరగనుంది. కవిత ఇప్పుడు నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నారు. బుధవారం ఆమె తన రాజీనామా లేఖను శాసన మండలి కార్యాలయానికి పంపించారు. తన రాజీనామాను ఆమోదించాలని గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫోన్ కూడా చేశారు. ఆమె రాజీనామా ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రంలో మరో ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. మరికొన్ని రోజుల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాను కూడా విడుదల చేసింది. ఈ నెలలోనే షెడ్యూల్ వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పుడు కవిత రాజీనామాను మండలి ఛైర్మన్ ఆమోదించినా కూడా స్థానిక సంస్థల్లో పాలక మండళ్లు లేవు. దీనివల్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇప్పుడే నిర్వహించడం సాధ్యం కాదు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి, పాలక మండళ్లు కొలువుదీరిన తర్వాతే ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ఈ ఉప ఎన్నిక కూడా ఆలస్యం కానుంది. కవిత ఎమ్మెల్సీ పదవి కాలం చూసుకుంటే 2028 వరకు ఉంది.

**కాంగ్రెస్ నేతల నజర్**

నిజామాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఖాళీ కాగా, స్థానిక ఓట్లతో ఆ స్థానంలో కూర్చోవాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. ఇది పీసీసీ చీఫ్ సొంత జిల్లా కాగా, ఈ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఈ జిల్లాలో ఎమ్మెల్సీ పదవికి అపుడే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కార్పోరేషన్ ఛైర్మన్ ఇరావత్రి అనిల్ పేర్లు వినబడుతున్నాయి.

# ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణపై సర్కారు స్కెచ్

## మంత్రి ఉత్తమ్ కీలకసమీక్ష.. నేడు సీఎంతో భేటీ

**హైదరాబాద్, మహా:** ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణపై రాష్ట్ర సర్కార్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనుల పురోగతిపై బుధవారం సెక్రెటేరియట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు ప్రకటించారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నట్లు తెలిపారు. నెలకు 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకుని.. జనవరి 2028 నాటికి పూర్తిచేస్తామని ప్రకటించారు. మొత్తం 44 కిలోమీటర్ల సొరంగమార్గానికి గాను ఇప్పటికే 35 కిలోమీటర్లు పూర్తయ్యిందని చెప్పారు. మిగిలిన తొమ్మిది కిలోమీటర్లు తవ్వడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రపంచం మొత్తంలో అత్యాధునిక సాంకేతికతో కూడిన హెలీబోర్న్ సర్వే నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ద్వారా ఈ సర్వే నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. తద్వారా సొరంగ మార్గం తవ్వకాల సమయంలో ప్రమాదాలను ముందుగానే పసిగట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకునే వెసులుబాటు ఇంజినీర్లకు ఉంటుందన్నారు. నీటిపారుదల సలహా దారుడిగా లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ నియామకం ఈ సొరంగ మార్గం పూర్తికి దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు షిఫ్ట్‌లలో పనిచేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటే నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు. ఆయా షిఫ్ట్‌లలో యువ ఇంజినీర్లను నియమించి రోజువారీ పురోగతిని రికార్డ్ చేయాలన్నారు. తవ్వకాల సమయంలో వస్తున్న నీటిని పంపింగ్ చేయడానికి విద్యుత్ బిల్లులు ఏడాదికి రూ.500 నుండి రూ.550 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. పైగా పంపింగ్ కోసం వినియోగిస్తున్న మోటార్లు 20 సంవత్సరాలు పూర్తికావడంతో అదనపు భారాన్ని భరిస్తూ మోటార్లను మార్చాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తయితే రోజుకు 0.3 టీఎంసీల నీటిని 90 రోజులపాటు అందించవచ్చన్నారు.

# కేసీఆర్‌కు పార్టీ ముఖ్యం.. కూతురు కాదు

## కవితపై వేటు వేయడం సరైన నిర్ణయమే

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తన కుమార్తె, కుమారుడి కంటే పార్టీయే ముఖ్యమని, అందుకే పార్టీని ధిక్కరించిన ఎమ్మెల్సీ కవితపై వేటు వేయడం సరైన నిర్ణయమని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో కేసీఆర్ ఎంత కఠినంగా ఉంటారో ఈ చర్యతో మరోసారి స్పష్టమైందని ఆయన అభిప్రాయపడ్డారు. కవిత సస్పెన్షన్‌పై స్పందిస్తూ, "ప్రతి కుటుంబంలో గొడవలు రావడం సహజం. అలాగే దేశంలోని ప్రతి పార్టీలో ఇలాంటి సస్పెన్షన్లు జరుగుతుంటాయి. కేసీఆర్‌కు తెలంగాణ ప్రజల శ్రేయస్సే ముఖ్యం. తన కుటుంబ సభ్యుల కోసం ఆయన పార్టీని నాశనం చేసుకోలేరు" అని అన్నారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ డ్రామాలకు తెరలేపిందని మండిపడ్డారు. "ఈ విషయంలో సీబీఐ కాదు, ఎవరు వచ్చినా ఏమీ చేయలేరు. కేవలం సీబీఐ పేరు చెప్పి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూడటం సరికాదు. ఆయన లాంటి గొప్ప నాయకుడు తెలంగాణకు దొరకడం మన అదృష్టం" అని మల్లారెడ్డి పేర్కొన్నారు.

# ఇంత నీచమైన ఆరోపణలు చేస్తారా?

- కవిత ఇది పద్ధతి కాదు.. దీనిని ఎవరూ హర్షించరు
- బ్రహ్మం గారికి సిద్దయ్య లాంటి వ్యక్తి.. కేసీఆర్‌కు హరీశ్ రావు
- నాడు ఆయన పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారు
- కవిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలపై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ నేతలు స్పందించారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, ముఠా గోపాల్ మాట్లాడారు. బ్రహ్మం గారికి సిద్దయ్య లాంటి వ్యక్తి కేసీఆర్‌కు హరీశ్ రావు అని అన్నారు. బీఆర్ఎస్‌కు సంపద లాంటి వ్యక్తని., ఆయనను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణకు నష్టం కాదా అని ప్రశ్నించారు. జలదృశ్యంలో దిమ్మె కట్టించిందే హరీశ్ రావు అని, ఏ పనిచెప్పినా ఎదురు మాట్లాడకుండా పనిచేసిన వ్యక్తి అంటూ ప్రశంసించారు. కార్యకర్తగా, నేతగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉండి పనులు చేస్తున్నారన్నారు. అనేక ఉప ఎన్నికల్లో తామంతా న్యూస్ పేపర్లు వేసుకుని ఒకే చోట నిద్రించిన వాళ్లమని, తెలంగాణ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వాళ్లమన్నారు. నాడు హరీశ్ రావు పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి ఎలా మనసు ఒప్పుతుందో అర్థం కావడం లేదన్నారు. ఈటల రాజేందర్ పార్టీ నుండి వెళ్లిపోవడంలో హరీశ్ పాత్ర లేదని, ఈటల ఆ పార్టీలోకి రావడానికి కారణం తానన్నారు.

**అలాంటి వ్యక్తి మీద ఆరోపణలు చేస్తారా..**

ఇది ఖచ్చితంగా ద్రోహ పాత్రగానే భావిస్తున్నామని, బహుళ ప్రయోజనం నెరవేర్చే చోట శత్రువు కుట్ర చేస్తుంటే దానికి బలం చేకూర్చేలా మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. విద్యుత్తు ఉద్యమ సమయం నుండి మొదలుపెడితే టీఆర్ఎస్ ఆవిర్భావం కన్నా ముందు నుండే పార్టీ గుర్తు, పార్టీ జెండా రంగు, ఉద్యమ సరళి మీద అనేక ఉద్యమాలు అధ్యయనం చేసిన వాళ్లలో మొదటి డజను, అరడజను వాళ్లలో నేను ఒకన్ని, అప్పటి నుండి హరీశ్ ఉన్నారన్నారు. అలాంటి వ్యక్తి మీద ఆరోపణలు చేయడమే కాకుండా, రేవంత్ కాళ్లు మొక్కాడని చెప్పడం చాలా బాధగా అనిపించిందన్నారు. 'అసలు ఈ ఆరోపణలను తెలంగాణ సమాజం నమ్ముతుందా? ఇంత అర్థరహితంగా ఆరోపణలు చేస్తారా? రేపు కేసీఆర్ ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్తే ఇలాగే ఆరోపణలు చేస్తారా? వాళ్లకు కష్టం వచ్చినప్పుడు పార్టీ అండగా నిలబడింది. కాళేశ్వరం ఎత్తిపోతల అనుమతుల కోసమే మహారాష్ట్రకు 25 సార్లు వెళ్లారు. ఏ శాఖను ఇచ్చినా సమర్థవంతంగా పనిచేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను సభలో, బయటా ఎండగడుతున్నది. హరీశ్ రావు మీద ఆరోపణలు చేయడం మూలంగా ఎవరికి లాభం చేకూరుస్తున్నారు?, సంతోష్ రావు ఎన్నడూ ప్రభుత్వంలో లేరు. ఆయన ఎక్కువగా కేసీఆర్ సహాయకుడిగానే ఉన్నారు. ప్రజలకు సాంత్వన చేకూర్చాల్సిన సమయంలో ఈ పంచాయతీ ఎందుకు ముందుకు పెడుతున్నారు? ఇది పద్ధతి కాదు. దీనిని ఎవరూ హర్షించరు' అని అన్నారు.

# నేడు కామారెడ్డికి సీఎం రేవంత్

## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

**హైదరాబాద్, మహా:** ఇటీవల అతిభారీ వర్షాలు కురిసి ప్రజా జీవనం అస్తవ్యస్తమైన కామారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించనున్నారు. తొలుత హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో బయలుదేరి తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకుని నష్టాలు సంభవించిన ప్రాంతాలను సందర్శిస్తారు. అక్కడ లింగంపేటలో వరదలకు దెబ్బతిన్న లింగంపల్లి కుర్దు ఆర్ అండ్ బి బ్రిడ్జిను, బుడిగిడ గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తారు. తర్వాత కామారెడ్డి మున్సిపాలిటీలో వరదలకు దెబ్బతిన్న రోడ్లను, నీట మునిగిన జీ ఆర్ కాలనీ సందర్శించనున్నారు. అనంతరం కామారెడ్డి ఐడీఓపీలో ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించి వరద నష్టంపై జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు.

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
ANN SCHOOL OF JOURNALISM ANN TELUGU ESTD.2025
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.
గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
అడ్మిషన్లు ప్రారంభమైనవి
అప్లికేషన్‌కు ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్‌కు ఇంటర్న్‌షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
HURRY UP! LIMITED TIME త్వరపడండి...
FOR ADMISSIONS CONTACT: +91 74369 39999
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE: WWW.ANNSCHOOLOFJOURNALISM.COM
2 DAYS TO GO
ఆఖరుతేదీ - సెప్టెంబర్ 4
తరగతులు ప్రారంభం : సెప్టెంబర్ 2వ వారం

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

EDITORIAL సంపాదకీయం

# సైద్ధాంతిక పోరాటం అవసరమా?





- పాతులోతు పాండు నాయక్
9885333196

భారతదేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న నక్సలిజం సమస్య కేవలం చట్టపరమైన, శాంతిభద్రతల సమస్యగా మాత్రమే పరిగణించబడుతోంది. అయితే నక్సలిజం అనేది ఒక ఆదర్శం, ఒక సిద్ధాంతం. కేవలం దాడులు, ప్రతిదాడులు, కాల్పుల ద్వారా దానిని అంతం చేయడం సాధ్యం కాదనేది నిర్వివాదాంశం. ఈ సమస్యను అర్థం చేసుకోవాలంటే, దాని మూలాల్లోకి వెళ్ళాలి. ఇది కేవలం ఆయుధాలతో చేసే పోరాటం కాదు, ఆలోచనల మధ్య జరిగే యుద్ధం. నక్సల్ ఉద్యమం సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పుట్టిన ఒక పోరాటం. దీనిలో ఉన్నవారు ప్రజల హక్కులను, స్వేచ్ఛను అణిచివేస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేసే సిద్దంతామే నక్సలిజం. ప్రభుత్వం పేద, బలహీన వర్గాలపై చూపించే బలం, అణచివేత, ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని ఆర్థిక విధానాలు పేదల కంటే ధనవంతులకు ఎక్కువగా లాభం చేకూరుస్తున్నాయని ఆరోపణలు. ఈ అసమానతలు, అన్యాయాలు నక్సల్ సిద్ధాంతానికి మరింత ఊతం ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను విని, వారి సమస్యలను పరిష్కరించాలి. కానీ వారిని అణచివేయడం, వారిని చంపడం ప్రజాస్వామ్య విలువలకు ద్రోహం చేయడం. ఆపరేషన్ కగార్ వంటి చర్యలు దేశ ఐక్యతకు, శాంతికి భంగం కలిగిస్తాయి. ప్రభుత్వం తమ చర్యలను పునరాలోచించుకోవాలి. లేకపోతే, ఈ అన్యాయం నిరసనలకు, పోరాటాలకు దారితీస్తుంది. అందులో భాగంగానే ఆపరేషన్ కగార్. ఆపరేషన్ కగార్ వెనుక ఉన్న అసలు కారణం అటవీ సంపదను కొల్లగొట్టి బహుళ జాతి కంపెనీలకు అప్పగించడమేనని తెలుస్తోంది. ఈ ఆపరేషన్ పేరుతో అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను దోచుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గిరిజనులను వారి స్వస్థలాల నుండి తరిమివేసి, ఆ ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఇది దేశ ప్రజలను మోసగించడమే.

ప్రభుత్వాలు నక్సల్స్ పట్ల అవలంబిస్తున్న విధానం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. నక్సల్స్‌ను సైనిక చర్యలతో అంతం చేయాలని ప్రయత్నించడం, వారి సిద్ధాంతాన్ని విస్మరించడం అనేది ఒక ప్రమాదకరమైన ధోరణి. మనుషులను చంపడం ద్వారా ఒక భావజాలాన్ని అంతం చేయలేము. ఎందుకంటే ఒక ఆలోచనను తుపాకులతో చంపలేము. తుపాకీని పట్టుకున్న వ్యక్తిని అంతం చేయవచ్చు, కానీ ఆ వ్యక్తి ఆలోచనను కాదు. నక్సలిజం వెనుక ఉన్న అసంతృప్తి, పేదరికం, నిరాశావాదం వంటి కారణాలను పరిష్కరించకుండా ఈ సమస్యను అంతం చేయలేము. ప్రభుత్వం తన విధానాలను సమీక్షించుకోవాలి. అన్ని వర్గాల ప్రజలకు సమానమైన అవకాశాలను, ప్రయోజనాలను అందించాలి. అలా కాకుండ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలని ప్రశ్నించిన పౌరుడిని కాల్చి చంపడం ప్రభుత్వాల వక్ర బుద్ధిని బయటపెడుతుంది. ప్రభుత్వాలు దేశంలో అంతర్గత సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనప్పుడు, ప్రజలను మభ్యపెట్టడానికి తరచుగా ఇటువంటి చర్యలకు పాల్పడుతుంటాయి. ఈ చర్యలు ప్రజల కష్టాలను, ఆందోళనలను పరిష్కరించవు. సమస్యను మరింత జటిలం చేస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. పౌరుల అణచివేతను జాతీయవాదం పేరుతో సమర్థించుకోవడం ఒక ప్రమాదకరమైన ధోరణి. పేదలు, గిరిజనులను లేకుండా చేయాలనే దుర్మార్గమైన ఆలోచనతోనే ఆపరేషన్ కగార్ చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

తరతరాలుగా అటవీ సంపదపై ఆధారపడి బతుకుతున్న గిరిజనుల గూడెలపై నక్సల్స్ పేరుతో కేంద్ర బలగాలు దాడి చేయడం ఎంతవరకు సమంజసం? ఈ చర్యలు గిరిజనుల సంస్కృతిని, జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నాయి. అడవికి, గిరిజనులకు ఉన్న అనుబంధం కేవలం ఆర్థికపరమైనది కాదు, అది వారి అస్తిత్వానికి సంబంధించినది. ఈ అనుబంధాన్ని తుంచివేయాలని చూడటం దారుణం. వారు కూడా ఈ దేశ పౌరులే. వారికి కూడా కొన్ని ఆలోచనలు, ఆకాంక్షలు ఉన్నాయి. వారిని కేవలం ఉగ్రవాదులుగా, దేశద్రోహులుగా చూడటం వల్ల సమస్య పరిష్కారం కాదు. వారి ఆందోళనలను, వారి సిద్ధాంతాలను అర్థం చేసుకోగలిగినప్పుడు మాత్రమే ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అదే విధంగా పేదలు, బలహీన వర్గాల కన్నీళ్లను తుడిచి, వారి జీవితాల్లో వెలుగు నింపడమే అసలైన దేశభక్తి. కానీ, దేశంలోనే ఒక భాగం, దేశ పౌరులపైనే దాడి చేసి, ఆ భూభాగంలో జాతీయ జెండా ఎగరేస్తే దాన్ని ఏమని భావించాలి? అది నిజమైన గెలుపు కాదు, కేవలం చేతకానితనం. దేశంలోనే ప్రజలను చంపి, తమ బలాన్ని ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? ఇది ఒక దేశం తన ప్రజలపైనే చేస్తున్న యుద్ధం. ఇది దేశ ఐక్యతకు, సమగ్రతకు భంగం కలిగించే చర్య. ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. ఒక దేశం తన సొంత ప్రజలపైనే యుద్ధం ప్రకటించడం ఎంతవరకు సమంజసం? దేశంలోనే ప్రజలను చంపి, తమ అధికారాన్ని ప్రదర్శించడం ఒక నీచమైన చర్య. ఇది దేశ ఐక్యత, సమగ్రతకు తీవ్రమైన భంగం కలిగిస్తుంది.

నిజమైన దేశభక్తి సరిహద్దులను రక్షించడం మాత్రమే కాదు. దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం, భద్రత, సమానత్వం కల్పించడం. పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడి చేసి విజయం సాధించినప్పుడు, యావత్ దేశం సంబరాలు చేసుకుంటుంది. సరిహద్దుల్లో చొరబడిన దేశద్రోహులను తరిమికొట్టి త్రివర్ణ పతాకాన్ని ఎగరేసినప్పుడు ప్రతి భారతీయుడి హృదయం ఆనందంతో ఉప్పొంగుతుంది. ఎందుకంటే అవి మన భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన పోరాటాలు. ఈ చర్యలు దేశ పౌరుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. దేశ పౌరులు తమ దేశం శక్తివంతంగా ఉండాలని కోరుకుంటారు. కానీ ఆ శక్తి దుర్వినియోగం కాకూడదు. తమ ప్రజలపైనే ప్రయోగించబడకూడదు. నిజమైన దేశభక్తి అనేది సరిహద్దులను రక్షించడమే కాదు, దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం, భద్రత, సమానత్వం కల్పించడం. దేశంలోనే ఒక భూభాగంపై జాతీయ జెండా ఎగరేయడం, దాన్ని ఒక గెలుపుగా చూపించడం ప్రజలను మోసగించడమే. ఈ పోరాటంలో గెలిచిన వారెవరు? ఓడిన వారెవరు? ఈ ప్రశ్నలకు జవాబు ఉండదు. నక్సలిజం సమస్యను పరిష్కరించాలంటే, సైనిక చర్యలను పక్కన పెట్టి, సైద్ధాంతిక పోరాటానికి దిగాలి. నక్సలిజం ఒక రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్య. దానిని చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య మార్గాల ద్వారానే పరిష్కరించాలి. నక్సల్స్‌కు కూడా దేశ పౌరులుగా మాట్లాడే అవకాశం కల్పించాలి. వారి ఆకాంక్షలను విని, వాటిని పరిష్కరించడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే ఈ సమస్య పూర్తిగా అంతం అవుతుంది. లేకపోతే, ఈ పోరాటం ఇలాగే కొనసాగుతూనే ఉంటుంది. నక్సలిజంను అంతం చేయడానికి ప్రభుత్వం సిద్ధాంతపరంగా చర్చించడానికి సిద్ధంగా ఉండాలి.

ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, గిరిజనులను వారి స్వంత భూమి నుండి తరిమివేయడానికి ఆపరేషన్ కగార్ వంటి బలవంతపు చర్యలను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చర్యలకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏకపక్షంగా 'నక్సలిజంను అంతం చేస్తాం' అనే నినాదంతో ఒక సైకో విధానాన్ని అవలంబిస్తోంది. కేంద్ర ప్రభుత్వం, ఈ చర్యలు ప్రజల కష్టాలను పరిష్కరించవు, పైగా సమస్యలను మరింత జటిలం చేస్తాయని తెలిసినా వెనక్కి తగ్గకుండా కేంద్ర బలగాలను మావోయిస్టుల మీదికి ఉసిగొల్పుతోంది. నక్సల్స్ ఉద్యమం కేవలం ఆయుధాలతో చేసే పోరాటం కాదు. అది అసమానతలు, అణచివేత, పేదరికం, నిరాశావాదం వంటి సామాజికఆర్థిక సమస్యల నుండి పుట్టుకొచ్చిన ఒక భావజాలం. ఈ మూల సమస్యలను పరిష్కరించకుండా కేవలం బలప్రదర్శనతో నక్సలిజంను అంతం చేయాలనుకోవడం ఒక వృథా ప్రయత్నం. ప్రభుత్వం ప్రజాస్వామ్య మార్గంలో గిరిజనులతో చర్చలు జరపాలి, వారి సమస్యలను పరిష్కరించాలి. అప్పుడే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది. లేకపోతే, ఈ అంతర్గత యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది, దీనిలో గెలిచేదెవరూ ఉండరు. భద్రతా పేరుతో అమాయకులకు,దళిత గిరిజన ప్రజలకు నష్టం కలిగించడమే బీజేపీ లక్ష్యంగా కనిపిస్తోంది. పౌరుల ఐక్యతను గౌరవించి ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమై, ప్రజల కోసం పనిచేయాలి. రాజకీయ లబ్ధికోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం తగ్గుతుంది. బాధ్యతాయుతంగా ప్రజలందరినీ సమానంగా చూస్తూ, వారి హక్కులను, భద్రతను కాపాడుతూ దేశ భవిష్యత్తు కోసం, ప్రజల ప్రశాంతత కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. కానీ అలా కాకుండా ప్రజలను రెచ్చగొట్టడం, విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందడమే బీజేపీ నైజంగా కనిపిస్తోంది. ఈ విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, దేశ ఐక్యతకు తీవ్ర హాని కలిగిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ సైనిక చర్యల ద్వారా నక్సలిజంను నిర్మూలించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతమాత్రం సరైంది కాదని ప్రజలు భావిస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే, సైనిక చర్యలను నిలిపివేసి, ప్రజాస్వామ్య మార్గంలో చర్చలు జరపాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పుడు ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి, కేంద్ర బలగాలను వెనక్కి తీసుకోవాలి. మావోయిస్టులతో చర్చలు జరపడమో, లేదా ఆ ప్రాంత ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించడమో చేస్తే ప్రజాస్వామ్యానికి విలువ, గౌరవం రెండూ దక్కుతాయి. బలప్రయోగంతో సమస్యను పరిష్కరించడానికి బదులు, ప్రజల మనసులను గెలుచుకోవడం ద్వారానే శాంతి నెలకొంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. ప్రభుత్వం "ఏకపక్షంగా నిర్మూలనే మా లక్ష్యం" అనే విధానాన్ని కొనసాగిస్తే ప్రజల సహనం నశించిపోయే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో ఉన్న అసమానతలు, పేదరికం, అణచివేత వంటి సమస్యలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం బలప్రయోగం ద్వారా ప్రజలను అణచివేయాలని ప్రయత్నిస్తే, అది ప్రజల తిరుగుబాటుకు దారితీసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

## రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# ప్రత్యర్థి క్షిపణులపై విరుచుకుపడే ఎస్-400

ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థలను మరికొన్ని సమకూర్చుకోవటంపై భారత్ దృష్టి సారించింది. ఇప్పటికే రష్యాతో చర్చలు మొదలైనట్లు సమాచారం. ఈ విషయాన్ని రష్యా రక్షణశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్400అద్భుతంగా పనిచేసినట్లు వాయుసేన పేర్కొనటంతో మరికొన్ని యూనిట్లు కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ ప్రత్యర్థి క్షిపణులను అడ్డుకోవటమే కాకుండా వాటిని ధ్వంసం చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఆపరేషన్ సిందూర్ వేళ ఈ రక్షణ వ్యవస్థ పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి వచ్చేలా చేసింది. దాయాదికి మళ్లీ కంటిమీద కునుకులేకుండా చేసే మరో విషయం వెలుగులోకి వచ్చింది. మరిన్ని ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలు కోసం భారత్ చర్చలు జరుపుతున్నట్లు రష్యా రక్షణ శాఖ వర్గాలు చెప్పినట్లు మాస్కో అధికారిక న్యూస్ టాస్ పేర్కొంది. భారత్ ఇప్పటికే ఎస్400లను వాడుతోందని మరిన్ని యూనిట్ల కోసం చర్చలు జరుపుతున్నట్లు రష్యా మిలిటరీ టెక్నికల్ కోఆపరేషన్ అధిపతి షుగయేవ్ తెలిపారు.

**అత్యధికంగా 36శాతం ఆయుధాలు రష్యా నుంచే కొనుగోలు**

పెరుగుతున్న చైనా సైనిక సామర్థ్యాన్ని ఎదుర్కొనేందుకు భారత్ 2018లో 5.5బిలియన్ డాలర్ల విలువ చేసే 5ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలు కోసం రష్యాతో ఒప్పందం చేసుకుంది. ఉక్రెయిన్ యుద్ధం సహా ఇతర కారణాలతో వాటి సరఫరా ఆలస్యమైంది. ఇప్పటి వరకు 3యూనిట్లు అందించిన రష్యా మిగతా రెండు 2026, 2027లో బట్వాడా చేయనున్నట్లు తెలిపింది. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గణాంకాల ప్రకారం 202024 మధ్యకాలంలో భారత్ అత్యధికంగా 36శాతం ఆయుధాలు రష్యా నుంచే కొనుగోలు చేసింది. తర్వాతి స్థానాల్లో ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా ఉన్నాయి. రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయకూడదని అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నప్పటికీ భారత్ ఏమాత్రం తలొగ్గలేదని రష్యా విదేశాంగమంత్రి సెర్గీలావ్రోవ్ అభినందించారు.



**ఏకంగా 300కి.మీ.దూరం నుంచే పాక్ విమానం ధ్వంసం**

ఆపరేషన్ సిందూర్ వేళ ఎస్400 ప్రపంచ రికార్డు సృష్టించింది. పాకిస్థాన్‌కు చెందిన విమానాన్ని ఏకంగా 300కి.మీ.దూరం నుంచే ధ్వంసం చేసినట్లు సైనికాధికారులు ప్రకటించారు. గతంలో ఎన్నడు కూడా ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాన్ని ఛేదించలేదన్నారు. ఇదివరకు 200కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను మాత్రమే కూల్చినట్లు చెప్పారు. ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థల్లో వాడే 4 రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజ్ 400కిలోమీటర్లు. వాయుసేన దానిని ఆపరేషన్ సిందూర్‌లో పూర్తిస్థాయిలో వాడుకుంది. వాటికి భయపడే పాకిస్థాన్ తమ ఎఫ్16 ఫైటర్ జెట్లు, చైనా నుంచి కొనుగోలు చేసిన యుద్ధ విమానాలను సుదూర ప్రదేశాలకు తరలించింది. సుదీర్ఘకాలంగా వ్యూహాత్మక భాగస్వాములైన భారత్‌రష్యాలు అనేక రక్షణ ప్రాజెక్టుల్లో పరస్పరం సహకరించుకున్నాయి. రష్యాకు చెందిన టీ90 ట్యాంక్‌లు, సుఖోయ్30 ఎంకేఐ భారత్‌లోనే లైసెన్స్‌డ్ ప్రొడక్షన్ చేస్తున్నారు. మాస్కో నుంచే మిగ్29 ఫైటర్ జెట్లు, కమోవ్ హెలీకాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్యాను అందుకొంది. ఏకే203 రైఫిల్స్, బ్రహ్మోస్ క్షిపణులను భారత్‌లోనే తయారు చేస్తున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అత్యున్నత వైద్య సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జైపూర్ మండలం గంగిపల్లి గ్రామ పల్లె దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె దవాఖాన కు వచ్చే ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించాలని అన్నారు. వైద్యులు ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న దృశ్య వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని అన్నారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు పాటించవలసిన జాగ్రత్తల గురించి తెలపాలని వెల్లడించారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనిసూచించారు. అనంతరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యలో ఉన్నత లక్ష్యాలను అధిగమించి లక్ష సాధన కొరకు పాటుపడాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నాలను తొలగించి సర్వ శుభాలను ప్రసాదించే దేవుడు వినాయకుడు

## ఎంపీ డీకే అరుణమ్మ

**షాద్ నగర్, మహా:** సర్వ విఘ్నాలను తొలగించి సకల శుభాలను కలిగించే దేవుడు, భాద్రపద శుద్ధ చవితి నుండి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకుని గంగమ్మ ఒడికి చేరే ఆ గణనాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఉమ్మడి పాలమూరు ఎంపీ అరుణమ్మ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని పలు గణపతి మండపాల సందర్శనలో భాగంగా పద్మావతి కాలనీ లోని శివభారత్ యూత్ అసోసియేషన్ గణేష్ మండపాన్ని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్యలతో పాటు సందర్శించుకుని మండపంలో ప్రతిష్ఠించబడిన గణనాథునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ డీకే అరుణమ్మ గణపతి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నందుకు శివ భారత్ భారతి యూత్ అసోసియేషన్ సభ్యులు సంతోషంతో ఆమెను శాలువతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివ భారత్ యూత్ అసోసియేషన్ సభ్యులతోపాటు న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్, వంశీకృష్ణ, అనిల్ గౌడ్ మల్చలం మురళి, కాసోజు శివ, హిందూ వాహిని చెట్ల వెంకటేష్, జంబుల నరసింహ, భాజపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ పాలన అధికారులకు ఈనెల 5న నియామక పత్రాలు

## రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్



**రంగారెడ్డి జిల్లా మహా :** ఈనెల 5వ తేదీన హైదరాబాదులోని హైటెక్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ పాలన అధికారుల(జీపీఓ)కు నియామక పత్రాలు అందజేయబడతాయని, జీపీఓలుగా ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ కు వచ్చేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ సూచించారు. జీపీఓ అభ్యర్థులు హైదరాబాద్ వెళ్ళడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్ మాట్లాడుతూ... జీపీఓలుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 5వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్న దృష్ట్యా, అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించి, హైదరాబాదుకు సకాలంలో చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఆయా జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులలో వారిని నిర్ణీత సమయానికి తరలించాలని ఆదేశించారు. నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలకు కూడా తెలియజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి సంగీత్ కలెక్టరేట్ ఏ.ఓ సునీల్, తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న

# కొత్తకుర్మ సత్తయ్య

**రంగారెడ్డి జిల్లా మహా:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో జనచైతన్య నగర్ లో శ్రీశ్రీశ్రీ హరి హర పుత్ర అయ్యపస్వామి దేవాలయ ప్రాంగణంలో, విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీకాబ్ వైస్ చైర్మన్, హైదరాబాద్ డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరై విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. ప్రజలు సంతోషంగా సుభిక్షంగా ఉండాలని ఆయన కోరినట్లు తెలిపారు. వీరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు శ్రవణ్ గౌడ్, బచ్చిగళ్ల రమేష్ పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని

# సందర్శించిన మాజీ కేంద్ర మంత్రి

**ఆదిలాబాద్ మహా :** మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, బోథ్ అసెంబ్లీ ఇన్చార్జ్ ఆడే గజేందర్ తలమడుగు తాజా మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డిలతో కలిసి బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి సాదర స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. జిల్లాలో చేరికలు పార్టీ బలోపేతం స్థానిక ఎన్నికలకు సంబంధించి పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, సందా నర్సింగ్ , రామ్ కుమార్, డేరా కృష్ణారెడ్డి,రాంరెడ్డి , నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం నాయకుల నిరసన



**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చ జాతీయ కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపైన 11% సుంకానీ తగ్గించడాన్ని నిరసిస్తూ, తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి ఎమ్మార్వో సుజాతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మోడీ ఆగస్టు 15 తారీకు రోజున గొప్పగా రైతులను ఆదుకుంటారని మాటలు చెప్పి, చేతలు మాత్రం కార్పొరేట్ విదేశీ వ్యాపారులకు మన దేశాన్ని దోచుకోమని స్వాగతం పలుకుతున్నారన్నారు. పత్తి రైతులకు ఉరి పెట్టే విధంగా వివిధ దేశాలలో వచ్చే పత్తికి దిగుమతి సుంకాలను తగ్గిస్తూ, మన దేశ రైతులకు పురుగుల మందు గతి అయ్యే పరిస్థితిని తీసుకొస్తున్నాడన్నారు. ఇప్పటికే పత్తి రైతులు పెట్టుబడులు రాక గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిలో మద్దతు ధర ఎం ఎస్ పి స్వామినాథ కమిషన్లు అమలు చేస్తానని చెప్పిన ప్రభుత్వం మరిచిపోయి నేడు దిగుమతి సుంకాలను తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు రుణమాఫీ చేయవలసిన ప్రభుత్వాలు సకాలంలో చేయడం లేక కల్తీ మందులు విత్తనాలు అరికట్టకపోవడంతో ,రైతులు నిత్యం ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. విత్తనాలు ఎరువులు పురుగుల మందు ప్రభుత్వం అందించి సబ్సిడీలు ఇవ్వాలని పత్తికి క్వింటాల్ కు 10వేల రూపాయల మద్దతు ధర ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో దుర్గం నూతన్ కుమార్ ,డాకురి తిరుపతి, భూఖ్య రమేష్. నాగేలి నర్సయ్య .గోరె బాయ్. బొమ్మరేణి నర్సయ్య ,సుంచుల నారాయణ.పిట్టల బీమేష్ .రాంపల్లి రాజేష్.గంగాధర భూమన్న పాల్గొన్నారు.

# వరదలతో కొట్టుకుపోయిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

## మరమ్మతుల నిర్మితమై నిధులు మంజూరు చేసిన ఎల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మహా:** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు బెల్లంపల్లి నియోజకవర్గం నేన్నల మండలం చిత్తాపూర్ జెండా వెంకటాపూర్ మధ్య ఉన్న రహదారి వరదలకు కొట్టుకుపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదురవుతున్న దృశ్య బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానిక కాంగ్రెస్ నాయకులు హరీష్ గౌడ్ సూచనలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ. 1,90,000/ మంజూరు చేశారు.నెన్నెల మండలంలోని చిత్తాపూర్ - జెండా వెంకటాపూర్ మధ్య రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బ తిని వరదలో కొట్టుకపోవడం, రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి హరీష్ గౌడ్ తీసుకువెళ్లడంతో సత్వరమే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించి నిధులు మంజూరు చేయడం జరిగింది. వరద ప్రభావంతో రోడ్డు కొట్టుకుపోయిన దృష్ట్యా ఎమ్మెల్యే తక్షణమే కలెక్టర్ తో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వరద ప్రభావిత సహాయ నిధుల కింద ₹1, 90,000 లు మంజూరు చేసారరు. రహదారి మరమ్మతలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా వర్షాకాలం అనంతరం శాశ్వత పరిష్కారం కోసం కొత్త కల్వర్టు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి ,బొమ్మెన హరీష్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేష్, జనగాం తిరుపతి అధికారులకు గ్రామస్థులుప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



**ఆదిలాబాద్ మహా:** వినాయక నవరాత్రోత్సవాలు జిల్లాలో ఉట్నూరు సబ్ డివిజన్ తో సహా అన్ని మండలాల్లో ప్రశాంతంగా జరుగుతున్నట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అలాగే ఈనెల 4 ,6 తేదీలలో నిమజ్జనం కి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన వివరించారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో సెక్టార్ల వారీగా విభజించి ప్రతి సెక్టార్ కి ఒక ఎస్ఐని ఇన్చార్జి గా నియమించినట్టుగా తెలిపారు. అలాగే సెక్టార్లపై క్లస్టర్లను ఏర్పాటు చేసి సీఐ స్థాయి అధికారి ఇన్చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. అంతేకాకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసామన్నారు. నిమజ్జనం పూర్తి అయ్యేంత వరకు ఫుట్ అండ్ బైక్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. నిమజ్జనం జరిగే చందా పెనుగంగ వద్ద అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తంగా 6వందల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ వివరించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా మండప నిర్వాహకులు హిందూ ఉత్సవ సమితి నాయకులు ప్రజలు సహకరించాలని కోరారు.

# నామకరణ వేడుకల్లో కాంగ్రెస్ నేతలు



**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని ఎస్టీయూ భవన్ లో జరిగిన చిట్ల మల్లారెడ్డి మనవరాలి నామకరణ మహోత్సవానికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, తలమడుగు తాజామాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. చిన్నారిని ఎత్తుకుని ముద్దాడి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.కంది శ్రీనన్న కానుకకు వారికి బహుకరించారు.వారి వెంట నాయకులు గిమ్మ సంతోష్ ,లోక ప్రవీణ్ రెడ్డి,డేరాకృష్ణారెడ్డి , రాంరెడ్డి, నరేష్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# మందమర్రి జిఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ రాధాకృష్ణ



**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా నూతన జిఎంగా ఎన్ రాధాకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.ఓ.టు.జి.ఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాం సుందర్, కే.కే.గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, ఐ.ఈ.డి అధికారి కిరణ్ కుమార్ ఇతర అన్ని డిపార్టుమెంట్ల హెచ్.ఓ.డీ లు పదవి బాధ్యతలు చేపట్టిన జిఎం కు పుష్పగుచ్చం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

**కే.కే.ఓ.సీ.ని సందర్శించిన జిఎం**

ఏరియా జిఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణ ముందుగా కే.కే.ఓ.సీ. ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్ వెంకట వంశీధర్ లను ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భారీ యంత్రాలు (డంపర్స్, షావల్) పరిశీలించారు. యంత్రాలకు అవసరమైన విడిభాగాలు సకాలంలో అందుబాటులో ఉంచి, బ్రేక్‌డౌన్లను తగ్గించాలని. సూచనలు చేశారు. అనంతరం వినాయకుడి పూజలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.


**ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం**

బుధవారం పదవి బాధ్యతలు చేపట్టిన ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ఏరియాలోని గనులు, డిపార్ట్ మెంట్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూగర్భ గనులు, ఓపెన్ క్యాస్టు ల పనితీరుల గురించి అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరు అధికారులు సమన్మయంతో కృషి చేయాలని వెల్లడించారు.

# బెల్లంపల్లి పట్టణంలో లోపించిన అభివృద్ధి



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో అభివృద్ధి అగమ్యగోచరంగా మారి కనీసం పారిశుధ్యం పై సైతం దృష్టిసారించని పరిస్థితి నెలకొన్నదని సిపిఎం నాయకులు తీవ్రంగా విమర్శించారు. బుధవారం రోజు సిపిఎం బెల్లంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు పట్టణంలోని వార్డులల్లో ఉన్న సమస్య లను తెలుసుకోవడం కోసం సిపిఎం బృందం పర్యటన చేయడం జరిగింది. పాత జిఎం కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసే క్రమంలో భాగంగా రోడ్డుపై బైఠాయించి పట్టణాభివృద్ధిపై గత పాలకుల తో పాటు ప్రస్తుత పాలకులు సైతం దృష్టి సారించడం లేదని నిత్యం పట్టణం లోని ప్రధాన రహదారులన్నీ గుంతల మయమై వాహనదారులకు ఇక్కట్లు కరగడంతో పాటు ప్రమాదాలు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలువార్డులలో పారిశు ధ్యం లోపించి దుర్గంధం వెదజల్లుతున్నదని అయినా మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించకపోవడం ఏమేరకు సబబు అని వారు తీవ్రంగా విమర్శించారు.గత 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా పట్టణంలో ఎక్కడ చూసినాచెత్తా,చెదారం ,మురు గు వాసన వస్తు ప్రజలు తీవ్రమైన ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారనీ పేర్కొన్నారు. నేటికీ కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం,దోమల మందు కొట్టకపోవడం,పారిశుధ్య పనులను తూ తూమంత్రంగా చెయ్యడం నిలుపుదల చేయాలన్నారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలిక హాస్టల్ ముందు రోడ్డుపైనే మురుకు నీళ్ళు నిలవడంతో విద్యారులు అనారోగ్యాల పాలౌతున్నరనీ,గురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ మురుగు వాసన వల్ల రోడ్డు వెంట వెళ్లే ప్రజలు దుర్గంధపూరితమైన వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నా రని, సంబంధిత ప్రాంతంలో ఆసుపత్రి, ఎంపీడీవో కార్యాలయం,పశువైద్యశా ల,కాలేజీలు,విద్య సంస్థలు ఉన్నాయి. విద్యార్థులు మురుగు వాసన పీల్చు కుంటూ చదువుకుంటున్న దుస్థితి ఇక్కడ కొనసాగుతుందని గుర్తు చేశా రు.బాలాజీ థియేటర్ నుంచి బజార్ ఏరియా వరకు రోడ్డు మొత్తంగా చెడిపోయి భారీగుంతలతో ఉన్నదనీ రోడ్డుపై ప్రయాణికులు ప్రాణాలను అరచేతి లో పెట్టుకొని నిత్యం వేల మందిప్రయా ణం చేస్తున్నారనీ పేర్కొన్నారు. సంబంధితరోడ్ల దుస్థితి ఎమ్మెల్యేకు, అధికారులకు కనిపించడం లేదా? ఎందుకు కొత్త రోడ్డు వేయడం లేదు? ప్రజల ప్రాణాలు అంటే మీకు లెక్క లేదా? అని సిపిఎం పార్టీ ప్రశ్నిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సంకె రవి ,సిపిఎం జిల్లా కార్యదర్శి, గుమాస అశోక్ సీపీఎం బెల్లంపల్లి మండల కార్యదర్శి,దుంపల రంజిత్ కుమార్,జిల్లా కమిటీసభ్యులు చల్లూరి దేవదాస్,దాగం శ్రీకాంత్, కొండపర్తి లచ్చన్న తదితర నాయకులు పాల్గొన్నారు.



# అధికారులతో కలెక్టర్ గూగుల్ మీట్

**ఆదిలాబాద్ మహా :** జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం సంబంధిత జిల్లా అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించి, వరద ప్రభావిత ప్రాంతాలలో తక్షణ సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల కారణంగా కలిగిన నష్టాలను సమీక్షించి, అన్ని శాఖలకు సూచనలు చేశారు. ప్రభావిత ప్రాంతాలలో రోడ్ల రవాణా సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించడం,వరద బాధిత గ్రామాలలో తాగునీటి సదుపాయాలను కల్పించడం,జరిగిన నష్టాలను వెంటనే అంచనా వేసి మరమ్మతులు చేపట్టడం లాంటి వాటిపై తగు సూచనలు చేసారు. అన్నిశాఖల మధ్య సమన్వయం అత్యవసరమని అన్నారు. ప్రభావిత కుటుంబాలకు సమయానుకూలంగా సహాయం ,పునరావాసం అందించేందుకు అధికారులు కలిసి పని చేయాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశానికి వ్యవసాయ, రెవెన్యూ, జిల్లాపరిషత్, ఆర్అండ్ బీ, పంచాయతీ రాజ్,గిరిజన సంక్షేమ, పబ్లిక్ హెల్త్ శాఖల ఇంజనీర్లు, విద్యుత్, మున్సిపల్ , ఇతర అధికారులు హాజరయ్యారు.

## గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ

# శరవేగంగా నిర్వహించాలి

### రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్

**మంచిర్యాల, మహా :** గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ శరవేగంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలన అధికారుల నియామకం సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. నియామక ఉత్తర్వుల పంపిణీ, మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ న హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఇన్చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించాలని తెలిపారు. కార్యక్రమానికి నియమించబడిన గ్రామ పాలన అధకారులను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లా నుండి హైదరాబాద్ లోని హైటెక్ సిటీ కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సకాలంలో నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలన అధికారులుగా నియమించబడే వారికి తమ స్వగ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వకూడదని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతులకు నిర్దిష్ట పరిస్థితులలో విశేష మినహాయింపులు ఇవ్వవచ్చని, సంబంధిత అంశాలను జిల్లా స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ప్రతి క్లస్టర్ కు తగిన అభ్యర్థిని నియమించేందుకు జిల్లా కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ లో జరగనున్న నియామక ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు చెందిన గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

### మేనిఫెస్టో హామీల పై ప్రభుత్వాన్ని నిలదీయాలి

### స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాయికుమార్

**హన్మకొండ మహా;** కాకతీయ యూనివర్సిటీ అతిథి భవనంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వెల్తూరి సాయికుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరికి వస్తున్న సమయంలో విద్యార్థులు నిరుద్యోగులు మహిళలు అందరూ పల్లె బాట పట్టి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అంతా ఏకమై వారిని ఎలక్షన్లో ఓడగొట్టి ఏరి కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసి విద్యార్థుల ను నమ్మించి గొంతు కోసిందని అన్నారు. అంతేకాకుండా నిరుద్యోగులు గత ప్రభుత్వంలో అనేక ఉద్యమాలు చేసి నిరుద్యోగ జేఏసీ ఏర్పాటు చేసుకొని కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగులు అందరూ ఓటు వేయాలని ప్రచారం చేసి గద్దెనెక్కిస్తే ఈరోజు నిరు




ద్యోగుల గురించి పట్టించుకోకుండా జాబ్ క్యాలెండర్ వెయ్యకుండా దివాలా తీస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు అండగా నిలవాలని లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నిరుద్యోగి నిలదీయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు ప్రతాప్, అజయ్, వెంకటేష్, చౌదరి, శ్రీకాంత్, మహదేవ్, టికాజి, రాజు, గణేష్, శివ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనం ఏర్పాట్లు, శానిటేషన్ పై సమీక్షా సమావేశం

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ మహా;** బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో జి డబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు, అలాగే పలు అంశాలతో పాటు నగరం లోని పారిశుద్ధ్యం పై శానిటేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జనం కోసం చెరువుల వద్ద చేపట్టాల్సిన చర్యలు, కావలసిన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బల్దియా కు చెందిన వాహనాల పని తీరు వాటి మరమ్మత్తులలో కలిగే జాప్యం తో పాటు శానిటేషన్ సిబ్బంది విధులకు హాజరు కాని వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ట్రేడ్ లైసెన్స్ పన్నుల సేకరణను మెరుగుపరచాలని, ప్రతిరోజు వాణిజ్య ప్రాంతాల నుండి చెత్త సేకరణ జరగాలని వ్యాపార వాణిజ్య ప్రాంతాలలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు, చెత్త బయటపడేసిన వ్యాపార యజమానుల పై జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. అవగాహన ద్వారా షెడ్యూల్ చేయబడిన డీలడ్జింగ్ ను నిర్ధారించడం ద్వారా ఎఫ్ఎస్టీపీ ని మెరుగుపరచాలని కార్యాచరణ ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేయబడిన ఫాగింగ్ కార్యకలాపాలు యధావిధిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఏం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు సానిటరీ ఇన్స్పెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.




## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం. కర్ణమామిడి గ్రామానికి చెందిన నాగమణి అనే గృహిణి నుండి 20 వేల రూపాయలు గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్కల వెంకటస్వామి లంచం తీసుకుంటుండగా ఆదిలాబాద్ ఏసీబీ, డి.ఎస్.పి. వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.... కర్ణమామిడి గ్రామానికి చెందిన డోల్క నాగమణి తనకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహ నిర్మాణం పనులు పునాది వరకు పూర్తి చేసింది. ఈ విషయాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి మొదటి విడత బిల్లును ఆమోదించేందుకు పనుల ఫోటోలు ఆన్లైన్లో అప్‌లోడ్ చేయమని పంచాయతీ కార్యదర్శిని కోరినట్లు తెలుస్తోంది. అందుకు గ్రామ కార్యదర్శి 30 వేల రూపాయలు ఇస్తేనే ఆన్ లైన్ చేస్తానని షరతు విధించినట్లు సమాచారం. కాగా ఎలాగోలా బ్రతిమిలాడి చివరికి నాగమణి 20 వేల రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకుంది. ఇట్టి విషయాన్ని బాధితురాలు ఏసీబీ అధికారులకు సమాచారం అందించినట్లు వ్యక్తమవుతుంది. తక్షణమే ఏసీబీ అధికారులు నాగమణితో పూర్తి విషయాలు మాట్లాడి పలు సూచనలు చేసినట్లు వెల్లడవుతుంది. బుధవారం వెంకటస్వామిని తన ఇంటికి రమ్మని పిలిచి ఒప్పందం ప్రకారంగా 20



వేల రూపాయలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అదిలాబాద్ ఇన్‌ఛార్జ్ డీఎస్పీ పి విజయ్‌కుమార్ లు తమ సిబ్బందితో గ్రామ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపి, అతడిని అరెస్టు చేసి కరీంనగర్ తరలించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ గురువారం కరీంనగర్ ఏసీబీ న్యాయస్థానంలో నిందితుడిని హాజరుపరుస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలలో ఎవరైనా అధికారులు డబ్బులు అడిగితే ప్రజలు వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో ఇన్స్ పేక్టర్లు కిరణ్, తిరుపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ గృహాల బిల్లులు, కొత్త రేషన్ కార్డుల జారీ, మరణ ధృవపత్రాలు మంజూరులో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు గ్రామస్థులు ఆరోపించారు.

## నిబంధనలు పాటిస్తేనే ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు

### డాక్టర్ సత్య శారద కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వరంగల్

**వరంగల్ మహా;** వరంగల్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సమావేశం డాక్టర్ సత్య శారద కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల వారు సమర్పించిన అన్ని పత్రాలను పరిశీలించి ఆ పత్రాలలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం సబ్మిట్ చేసిన ప్రైవేటు ఆసుపత్రుల కు అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు. కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు సరైన పత్రాలు సమర్పించలేదని వాటిని రిజెక్ట్ చేస్తూ తిరిగి రీ సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులు క్లినిక్లు పాలీ క్లినిక్లు ల్యాబ్లు ఫిజియోథెరపీ సెంటర్లు కంటి పరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అలాగే జిల్లాలోని ఆయుర్వేద యునాని హోమియో సిద్ధ యోగ నేచురోపతి వంటి ఆసుపత్రులు కూడా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ అక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తూ లేనిపక్షంలో వారి పై జరిమానా విధిస్తూ ఆ హాస్పిటల్స్ ను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అధిక సీ సెక్షన్లు ఆపరేషన్ చేసిన హాస్పిటల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం నిర్వహించని హాస్పిటల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తన బృందంతో నిరంతరం తనిఖీలు చేయాలని నిబంధనలు పాటించని వారి పైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిర్వహించు హాస్పిటల్స్ ఏ ఆర్ టి సెంటర్స్ సరోగసి సెంటర్స్ నిర్వహిస్తున్న నిర్వాహకులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం నిర్వహించి తగిన నివేదికలు ప్రతినెల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎవరైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లయితే చేయడానికి ప్రోత్సహించినట్లయితే వారిని గుర్తించి వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పి సి పి ఎన్ డి టి యాక్ట్ లోని ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించినారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తామని ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, శ్రీధర్ రెడ్డి, పోలీస్ కమిషనరేట్, వరంగల్ నుండి లచ్చయ్య, విల్సన్, ఐఎంఏ సభ్యులు డాక్టర్ అజిత్ అహ్మద్, డాక్టర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలి

### మహిళలకు చీరల పంపిణీ చేసిన ఆడెపు వెంకటేష్

**వరంగల్ మహా;** ప్రజా సేవే పరమావధిగా తాను నమ్ముకున్న సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ ముందుకు వెళ్తున్న యువ నాయకుడు ఆడెపు వెంకటేష్.. గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎటువంటి ప్రచారం లేకుండా తాను ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో 36వ డివిజన్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 36వ డివిజన్ లోని ఆదర్శ నగర్, జీబీ నగర్, పుప్పాలగుట్ట, చంద్రవదన్ కాలనీ, ఏసీ రెడ్డి నగర్, చింతల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద డివిజన్ కు చెందిన 200 మంది ఆడబిడ్డలకు సుమారు లక్ష రూపాయల విలువ చేసే చీరలను స్థానిక బీజేపి నాయకులు ఆడెపు వెంకటేష్ బుదవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సాంప్రదాయాలను సంస్కృతిని



మరిచి ఎక్కడ చూసినా డీజే శబ్దాలతో ఇతరాత్ర ఆధునిక పోకడలతో సంస్కృతికి భిన్నంగా జరుగుతున్నాయనిఇలాంటి పరిస్థితుల్లో మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయలకు అనుగుణంగా మహిళలంతా ఒకే వేశాధారణాలతో ఉత్సవాలు జరుపుకోవాలనే సదుద్యేశ్యంతో మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప అధ్యక్షులు, కమిటీ సభ్యులు, యూత్ మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన కాజిపేట ఏసీపీ

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణపతి నిమజ్జనం ఏర్పాట్లను కాజీపేట్ ఏసీపి ప్రశాంత్ రెడ్డి, స్థానిక హసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు, సబ్ ఇన్స్పెక్టర్ దేవేందర్ లతో పాటు వివిధ శాఖల అధికారుల తో కలిసి హసన్పర్తి చెరువును సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏసీబీ మాట్లాడుతూ వన్ వే ట్రాఫిక్, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాట్లు, లోతు ప్రదేశాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు, ప్రథమ చికిత్స విభాగం, రోడ్డు కు ఇరువైపులా బారికేడ్లు, జేసీబి, క్రేన్లు అందుబాటులో ఉండేలా చూ



సుకోవాలని భక్తులను నిమజ్జనం దృష్టిలో ఉంచుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా అన్ని విభాగాలు సమిష్టిగా పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు.

## వైభవంగా కుంకుమ పూజా కార్యక్రమం

### పెద్ద ఎత్తున పాల్గొన మహిళలు

**వరంగల్ మహా;** వరంగల్ నగరం పోచమ్మ మైదాన్ లోని దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుంకుమ పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు భక్తులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తక సంఘం సభ్యులు, దాతల సహకారంతో 6వ రోజు అన్నదానం తో పాటు సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం



శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, వర్తక సంఘం ప్రతినిధులు, సభ్యులు, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

## జీపీఓలకు నియామక పత్రాలు జారీ

### సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్

### అభ్యర్థుల తరలింపుకు ఏర్పాట్లు చేయాలి

**వరంగల్ మహా;** గ్రామ పరిపాలన అధికారులుగా ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలు అందుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిసిఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ సూచించారు. బుధవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ అదనపు కలెక్టర్ జి.సంధ్యరాణి తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా వీసీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీఓల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పరీక్ష నిర్వహించిందని ఇందులో భాగంగా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 5 వ తేదీన హైటెక్స్ లో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే



అభ్యర్థుల సౌకర్యార్థం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాకు సంబందించి 165 మంది గ్రామ పరిపాలనాధికారులుగా నియామక పత్రాలు తీసుకోనున్నారని, ఇందుకు తగ్గ పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తు తగిన చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విసిలో డి ఆర్ వో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా ములుకనూరు లోని మోడల్ స్కూల్ సమీపం గ్రామంలోని మురుగు కాలువల ద్వారా వచ్చే మురుగునీరు, వర్షపు నీరు నిల్వ కారణంగా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని మోడల్ స్కూల్ సమీపంలో ఇటీవల మంజూరై ఉన్న ఇంకుడు గుంతలను నిర్మించనున్న స్థలాన్ని, మోడల్ స్కూల్లో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను, పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లను, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అభివృద్ధి



పనుల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారాం, డీఈ శిరీష, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబంపై సిబిఐ విచారణ జరపాలి

### వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి

**వరంగల్ మహా;** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్వయంగా ఆమె చెప్పిన మాటలను అనుసరించి గత బిఆర్ఎస్ హయాంలో హరీష్‌రావు, సంతోష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, అవినీతి పరులని కవిత విలేకరుల సమావేశంలోనే బహిరంగంగా ఒప్పుకున్నారు కాబట్టి తక్షణమే వీరు పై సిబిఐ విచారణ చేపట్టి నిజా నిజాలు బయటికి తీసి వీరికి శిక్ష విధించి వీరు అవినీతితో సంపాదించిన డబ్బులను ఆస్తులను జప్తు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉపయోగించాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్



రాజనాల శ్రీహరి ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కుమ్మరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల్లో నానో యూరియా వాడాలి

### నానో యూరియా వాడండి.. భూసారాన్ని కాపాడండి

### వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద




**వరంగల్ మహా;** ఉద్యాన పంటల్లో నానో యూరియా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం గీసుగొండ మండలంలో డ్రోన్ద్వా రా తిమ్మాపురం శ్రీకాంత్ వరకాయ తోటలో (నానోయూరియా ) పచికారీ చేయించడం జరిగింది. క్షేత్ర ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు ఉద్యాన పంటల్లో నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తీగ జాతి కూరగాయలైన సోర్ట్, బీర్ కాండోర్, దొండ, దోస, పొట్ల, బోడకాకర్ తదితర పంటల్లో ఈదశలో నేలపై మొత్తం పరుచుకొని ఉండడం వల్ల డ్రోన్ సాయంతో నానోయూరియా స్ప్రే చేయడం వల్ల నత్రజని వినియోగ సామర్థ్యం పెరిగి మొక్క ఎదుగుదల జరిగి అధిక దిగుబడులు పొందవచ్చని, దీనికి బదులుగా "ఘన రూపంలో ఉన్న యూరియా బస్తాలు వాడితే మొక్కకు సరిగా అందక ఎక్కువగా పృథా అవుతుందని అన్నారు. శాశ్వత్ తీగజాతి కూరగాయల సాగులో పందిళ్ళా పైన పోషకాలు పురుగు మందుల పిచికారీ చేయడం, సాధారాణ స్ప్రేయర్స్ తో కష్టంతో కూడిన పనియని, అదే డ్రోన్ ద్యారా సులభంగా ఎకర విస్తీర్ణంనకు 10 నిమిషాల్లో పిచికారి చేయచ్చునని అన్నారు. అరటి, బొప్పాయి, మొనగ లాంటి ఎక్కువ ఎత్తి పెరిగే ఉద్యాన పంటల్లో డ్రోన్ ద్వారా పోషకారమైన నానో యూరియా పిచికారి చేసుకోవచ్చునని అన్నారు . నానో యూరియా అనేది నత్రజనిని మొక్కలకు మరింత సమర్థవంతంగా అందించే ఎరువని, దీన్ని సమర్థవంతంగా పంటల చురుకైన పెరుగుదల దశలో లీటర్ మీటర్ నీటికి 24మి.లీ. చొప్పున కలిపి ఆకులపై పాచికారి చేయాలి. నానో యూరియా చిన్న కణాల రూపంలో ఉడటం వల్ల మొక్కలు వేగంగా, సులభంగా గ్రహిస్తాయని, మొక్కలు బాగా ఎదిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే నానో యూరియా వాడిన రైతులు మిగిలిన రైతులతో వారి అనుభవాలను పంచుకొని ఉద్యాన పంటల సాగులో పెద్దఎత్తున నానోయూరియా వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహసీల్దార్ రియాజుద్దీన్, ఉద్యాన అధికారి తిరుపతి, ఎంఈఓ హరిప్రసాద్, హెచ్ ఈఓ వేణు, ఏఈఓ రజని, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు

### పాల్గొన్న ఎస్సై, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

**వరంగల్ మహా;** గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని అంతే ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరుపుకోవాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఏనుమాముల ఎస్సై మారేపల్లి రాజు అన్నారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని సుందరయ్య నగర్ లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఏనుమాముల ఎస్ఐ మారేపల్లి రాజు హాజరై గణపతికి పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు వీరారావు, సంపత్ ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు గంద్రాతి భాస్కర్, గంద్రతి నవీన్, అల్లం రాజు, అంబిరి ప్రసాద్, సుధాకర్, మేకిరి భుజంగరావు, మార్లోడు నవీన్, తోకల రమేష్, వరలక్ష్మి, లలిత, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ కుటుంబానికి ఎమ్మెల్యే నాయిని భరోసా

### ప్రభుత్వ డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు అందిస్తానని హామీ

**వరంగల్ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 29వ డివిజన్ రఘునాథ్ కాలనీకి చెందిన తెలుకల పెల్లి సురేష్ ఇల్లు ఇటీవల విద్యుత్ ఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి సురేష్ నివాసానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ప్రమాదానికి దారితీసిన కారణాలను తెలుసుకున్నారు. అలాగే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సురేష్ కుటుంబానికి తక్షణ సహాయం అందజేశారు. కేవలం ఆర్థిక సహాయంతోనే ఆగిపోకుండా, భవిష్యత్తులో ఈ కుటుంబానికి స్థిరమైన ఆధారం కల్పించాలనే




ఉద్దేశ్యంతో ప్రభుత్వ అందించే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును కూడా కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, డివిజన్ అధ్యక్షులు పూర్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కవిత మాటల్లో నిజాయితీ ఉంటే సిబిఐ విచారణలో సాక్ష్యంగా ఉండాలి

### సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడు.. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం డీసీసీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ 1200 మంది తెలంగాణ విద్యార్థుల ఆత్మలు కవిత రూపంలో మాట్లాడించాయని నిజం మాట్లాడని నేతలు బిఆర్ఎస్ పార్టీలో కోకొల్లలుగా ఉన్నారని అధికారంలో దోచుకున్న సొమ్ములను పంచుకునే క్రమంలో వచ్చిన పంచాయతీ ఇదేనని అన్నారు. పదేళ్ల క్రిందట కెసిఆర్ కుటుంబం ఆస్తులు ఎంత.. ఇప్పుడు మీ ఆస్తులు ఎంత అని ప్రశ్నించారు. కాళేశ్వరం మీ హయాంలో కట్టింది వాస్తవమే, కూలింది కూడా వాస్తవమేనని కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాముల అయిన అధికారుల ఇళ్ళల్లో సోదాలు చేస్తే వందల కోట్ల రూపాయల దొరికింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.. ట్రిబుల్ షూటర్ హరీశ్ రావు నాయకత్వంలో ప్రజల ఆస్తులను ట్రబల్ లో పెట్టారని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ కవిత మాటల్లో నిజాయితీ ఉంటే మీరు చేసిన ఆరోపణలలో వాస్తవం ఉంటే సిబిఐ విచారణకు మీరు సాక్ష్యంగా ఉండాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో అవినీతి జరిగిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి వాదిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి తో పాటు విజన్ ఉన్న నాయకుడు అని తెలిపారు. బినామీల పేర్లతో లక్షల కోట్ల అవినీతి చేసిన బి ఆర్ ఎస్ నేతలు ఈమె చేసిన ఘనతకు ర్యాలీలు, ధర్నాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.



తెలంగాణ స్వలాభం కోసం మాట్లాడితే రేవంత్ రెడ్డిని చంద్రబాబు శిష్యుడు అని అంటున్న మీరు గతంలో హనుమంత రావు నాయకత్వంలో పనిచేసిన కేసీఆర్ ఎవరి శిష్యుడు అని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ పేరుతో మీ ఇల్లు బంగారం చేసుకున్నారని ప్రజల ఆస్థిని, అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది మీరే అని ముఖ్యంగా మీ వ్యక్తిగత కుటుంబ విషయాల గురించి మాకు అవసరం లేదని మీరు కలిసి దోచుకున్న ప్రతి రూపాయి తెలంగాణ ప్రజలకు పంచే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోదని స్పష్టం చేశారు. జిలాల్లో బి ఆర్ ఎస్ నేతలు సంపాదించిన ఆస్తులను కూడా అధరాలతో నిరూపించి ప్రభుత్వం జప్తు చేయాలని ఈ సందర్భంగా నాయిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగల వెంకట్రామ్ రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, పులి అనిల్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్లు జక్కుల రవీందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, మైనారిటీ అధ్యక్షులు అజీజ్ , రహీమున్నీసా బేగం తో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ నాయకుల నైజం

- స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికే బీజేపీ నాయకుల ధర్నాలు
- కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లలో అమలు కాని హామీల కోసం బిజెపి నాయకులు దీక్ష చేయాలి
- కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి చూసి ఓర్వలేక విమర్శలు: శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా,వైద్యం, సాగు నీరు, త్రాగు నీరు, విద్యుత్, , మహిళా సాధికారత, రైతు సంక్షేమం నియోజకవర్గం లో వందల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు బిజెపి నాయకులకు కనబడడం లేదా అని టిపిసిసి సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో డిసిసి ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మలతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతు బిజెపి నాయకులు దీక్ష చేయాల్సింది రాష్ట్రానికి రావలసిన నిధులు, యూరియా కేటాయింపు, 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కల్పన, అధికారంలోకి వచ్చిన 12 ఏళ్లలో అమలు కాని హామీల కోసం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం బిజెపి నాయకులు కల్వకుర్తి నియోజకవర్గంలో నిరసన దీక్షలు సాగిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి నాయకుల నైజం అన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు ,పేదలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య చికిత్సలకు రూ 10 లక్షల ఆర్థిక సాయం , రూ.2 లక్షల పంట రుణాల మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్లు , సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ వంటి ఎన్నో కార్యక్రమాలు బిజెపి నాయకులకు కనబడడం లేదా అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. 6 గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలుపరుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారం, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో కల్వకుర్తి నియోజకవర్గం 20 నెలలలో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్న బిజెపి నాయకులు అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటా గురించి ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు.రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిసారి మొండిచేయ్యి చూపిస్తుంటే ఎందుకు మీ అధిన్యాయకత్వాన్ని అడగరు అని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని అధిగమించి సంక్షేమ అభివృద్ధి పథకాలను కొనసాగిస్తుందని చెప్పారు. బిజెపి నాయకులు సాగిస్తున్న విష ప్రచారాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్య నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి, నాయకులు లక్పతి నాయక్ ,మల్లేష్ గౌడ్, సత్యం యాదవ్ ,మంకీ శ్రీను ,వినోద్, జవహర్లాల్ నాయక్ ,తులసి రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పలుకు జగదంబ పలుకు అన్నట్టు ఉంది కవిత పలుకులు

**షాద్ నగర్, మహా:** భారత రాష్ట్ర సమితి తెలంగాణ సెంటిమెంట్ మీద రెండుసార్లు అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. కాళేశ్వరం కులేశ్వరంగా మారిందని, అన్నారం, మేడిగడ్డ ఆగమయ్యాయని, గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో ప్రజల సొమ్మును దోచుకొని తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించారు. కాళేశ్వరం పై అవినీతి జరిగిందని అంబ పలుకు జగదంబ పలుకు అన్న చందంగా సొంత బిడ్డనే చెప్తుంటే కొందరు బిఆర్ఎస్ నాయకులు మేము సత్యహరిచంద్రులం అన్నట్టు నటించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి పారదర్శకంగా నిబద్ధత కలిగిన పిసి గోస్ కమిటీని ఏర్పాటు చేసి 17 నెలలకు పైగా సమయం తీసుకొని ముందుకు వెళుతుంటే షాద్ నగర్ నియోజకవర్గంలో కొందరు పనికిమాలిన సన్నాసులు, వెదవలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్ నగర్ నియోజకవర్గం నుంచి



ప్రాతినిధ్యం వహించిన శాసనసభ్యుల ఆస్తుల వివరాలను తీస్తే గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యే ఆస్తుల వివరాలను చూడండని, నియోజకవర్గంలో సైతం ఎంత అవినీతి జరిగిందో ప్రజలకు తెలుసని అన్నారు. దోచుకోవడం,దాచుకోవడం మీ రాజకీయ చరిత్ర నియోజకవర్గ ప్రజలందరికీ తెలసని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక కొందరు బి ఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, సీనియర్ నాయకులు రఘు, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు

# విఘ్నేశ్వరుడి దయవల్ల ప్రజలంతా చల్లగా ఉండాలి

- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
- శివభారత్ యూత్ వినాయక మండపంలో ప్రత్యేక పూజలు

**షాద్ నగర్, మహా:** విగ్నేశ్వరుడి దయవల్ల ప్రజలకు ఉన్న విఘ్నాలు తొలగిపోయి ఏ పని ప్రారంభించినా విజయాలు పొందెలా ఆ భగవంతుడి ఆశీర్వాదాలు ఉండాలని కోరుతూ మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం షాద్ నగర్ పట్టణంలోని శివభారత్ యూత్ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీ, ఎల్ ఎన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆధ్యాత్మికత ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్స్ నందకిశోర్,బండారు రమేష్, బెజుగాం రమేష్, వెంకట్ రెడ్డి, దండు వాసు, జర్నలిస్ట్ లక్కాకుల రమేష్ కుమార్, టాప్సన్ వెంకటేష్, మహేష్, పల్లె శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు, రఘుమా రెడ్డి, చిన్న, నంద కిషోర్, అడ్వకేట్ నరేందర్,అందె ప్రభులింగం,మహేశ్వర్ పాల్గొన్నారు.

# బుల్లెట్టు రైలెక్కి వచ్చేత్తపా..!



ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మరోసారి వార్తల్లో నిలిచారు. సుమారు ఆరేళ్ల తర్వాత.. పొరుగు దేశం చైనాలో ఆయన పర్యటిస్తున్నారు. బీజింగ్‌లో బుధవారం జరగబోయే రెండో ప్రపంచ యుద్ధ వార్షికోత్సవ సైనిక కవాతును ఆయన వీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా 26 దేశాధినేతలు పాల్గొనబోతున్నారు. కిమ్ జోంగ్ ఉన్ రైలు ప్రయాణం గురించి ప్రపంచం ఇప్పుడు ఆసక్తికరంగా చర్చించుకుంటోంది. 2019లో చైనా, 2023లో రష్యాలో పర్యటించిన టైంలోనూ ఆయన రైలు మార్గం గుండానే ప్రయాణించారు. ఉత్తర కొరియా పాలకులకు ఇలా రైలు ప్రయాణం కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. కాదు కాదు ప్రత్యేక కారణాల దృష్ట్యా తప్పడం లేదు!!.. కిమ్ జోంగ్ ఉన్ ప్రయాణించే రైలు మామూలుది కాదు. సుమారు 90 కోచ్‌లు ఉండే ఈ రైలులో కాన్ఫరెన్స్ రూమ్, బెడ్‌రూమ్స్, ఫ్లాట్ స్క్రీన్ టీవీలు, అంతర్జాతీయ వంటకాలు, ఖరీదైన రెడ్ వైన్లు అందుబాటులో ఉంటాయి. రైలు అంతర్గతంగా పింక్ లెదర్ ఆర్మ్‌చైర్లు, జెబ్రా ప్రింట్ డిజైన్, బోర్డో వైన్లు, లాబ్‌స్టర్లు, అంతర్జాతీయ వంటకాలు, కాన్ఫరెన్స్ హాళ్లు, బెడ్‌రూమ్స్‌తో రాజసంగా ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చెఫ్‌లు, రెడ్ వైన్లు, నృత్య కళాకారుల బృందం ఆయన వెంట ప్రయాణిస్తారు. అయితే.. అది పూర్తిగా బుల్లెట్‌ప్రూఫ్, బాంబ్‌ప్రూఫ్. ఇది కుటుంబ భద్రతా భయాల కారణంగా ఏర్పడిన సంప్రదాయం. ఈ రైలు వేగం గంటకు 50 కిలోమీటర్లు మాత్రమే. భారీ సాయుధ కవచాలతో నిర్మించబడి ఉండడం వల్ల దీని ప్రయాణం కూడా అంతే భద్రంగా సాగుతుంటుంది. భారీ సాయుధ కవచాలతో నిర్మించబడి ఉండడం వల్ల దీని ప్రయాణం కూడా అంతే భద్రంగా సాగుతుంటుంది. అందుకే.. కిమ్ జోంగ్ ఉన్ తన తండ్రి, తాతల మాదిరిగా విమానాలకంటే రైలు ప్రయాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ రైలు కేవలం రవాణా సాధనం కాదు, అది ఒక మొబైల్ కమాండ్ సెంటర్గా పనిచేస్తుంది. ఈ రైలు కోసం అంతర్జాతీయ రక్షణ, రైలు నిర్మాణ నిపుణులు పని చేశారు. ఈ స్థాయి సౌకర్యాలు, భద్రతా వ్యవస్థలు కలిగి ఉండే రైలు నిర్మాణం, నిర్వహణకు సుమారుగా 200-300 మిలియన్ డాలర్లు (మన కరెన్సీలో రూ.1,600-రూ.2,400 కోట్లు) వరకు ఖర్చు అయ్యిందనే అంచనా. ఉత్తర కొరియా-రష్యా-చైనా మైత్రి బలోపేతం ద్వారా.. తద్వారా అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా బలమైన సంకేతాలు పంపే ప్రయత్నంగా కిమ్ పర్యటనను విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో చైనా, ఉత్తర కొరియా మధ్య ఆర్థిక, భద్రతా సంబంధాలు మరింత బలపడే అవకాశం ఉందనే చర్చా నడుస్తోంది.

# నీటిని బకెట్లలో నింపుకోండి.. వరదల పరిష్కారానికి పాక్ మంత్రి వింత సలహా



ఇస్లామాబాద్: పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి తన విచిత్రమైన వ్యాఖ్యలతో ట్రోల్ అవుతున్నారు. పాకిస్తాన్‌ను వరదలు ముంచెత్తిన వేళ.. ఆ వరదల్ని ప్రజలు వరంగా భావించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు వరద ప్రవాహాన్ని అడ్డుకునేందుకు వరద నీటిని బకెట్లు,ట్యూబ్‌లలో నింపాలని విజ్ఞప్తి చేశారు. పాక్‌లో ఇటీవల రికార్డ్ స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఫలితంగా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పంజాబ్ ప్రావిన్స్ మొత్తం నీట మునిగింది. 24 లక్షల మంది పౌరులు వరద ముంపుకు గురయ్యారు. వేలాది గ్రాముల నీట మునిగాయి. భారీ ఎత్తున ఆస్తినష్టం,ప్రాణ నష్టం సంభవించింది. ఈ క్రమంలో ఆదేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్థానిక మీడియా సంస్థ దున్యా న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ..వరద ముంపు గురైన ప్రజలే.. వరద నీటిని ఇంట్లోకి తోడుకోవాలి. ప్రజలు ఈ వరద నీటిని తమ ఇళ్లలో టబ్‌లు, కంటైనర్లలో నిల్వ చేసుకోవాలి. వరద నీటిని దేవుడి ఆశీర్వాదంగా చూడాలి. అందుకే ఆ నీటిని నిల్వచేయాలని' పిలుపునిచ్చారు. అంతేకాదు, పాకిస్తాన్ 1015 సంవత్సరాలు మెగా ప్రాజెక్టుల కోసం వేచి ఉండకుండా త్వరగా పూర్తి చేయగల చిన్న,చిన్న డ్యామ్‌లను నిర్మించాలని ఆసిఫ్ సూచించారు.మనం నీటిని కాలువలోకి వదిలేస్తున్నాం.అలా వదిలేయకూడదు.ఆ నీటిని నిల్వ చేసుకోవాలన్నారు. పాకిస్తాన్‌లో భారీ వర్షాల కారణంగా, పంజాబ్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలో వరద పరిస్థితి నెలకొంది. 5 లక్షల మంది తమ ఇళ్లను వదిలి వెళ్ళవలసి వచ్చింది. పాకిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) ప్రకారం జూన్ 26 నుంచి ఆగస్టు 31 వరకు పాకిస్తాన్‌లో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 854కి పెరిగింది. 1100 మందికి పైగా గాయపడ్డారు. NDMA ప్రకారం మరణాలలో మూడింట రెండు వంతుల మంది ఇళ్ళు కూలిపోవడం, ఆకస్మిక వరదల కారణంగా సంభవించగా వందలాది మంది మృతి చెందారు. పంజాబ్ చరిత్రలో ఇది అతిపెద్ద వరద అని పంజాబ్ మంత్రి ఔరంగజేబ్ అన్నారు. సట్లెజ్, చీనాబ్, రావి నదుల నీటి మట్టం ఇంతగా పెరగడం ఇదే మొదటిసారి.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL





# జర్మనీలో తొలిసారి గణేష్ వేడుకలు

### భారీగా హాజరైన భారతీయులు



**మహా :** తొలిసారి జర్మనీలోని ఖామ్ బవరియాలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జర్మనీ మొత్తం నుంచి రెండు వందల మంది భారతీయులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన అరుణ్ కుమార్ గున్నాల యువకులతో కలిసి భారీ ఎత్తున ఈ వేడుకను నిర్వహించారు. ఉత్సవంలో గణేశ్ నిమజ్జనం ర్యాలీ, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఖామ్ సిటీ మేయర్ బార్బరా, డిస్ట్రిక్ట్ కలెక్టర్ మార్కస్, కాంటినెంటల్ టైర్స్ అధినేత అల్బర్ట్ కైసర్ తదితరులు హాజరయ్యారు. జర్మన్ ప్రజలకు భారతీయ వంటకాలు వడ్డించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కీర్తన కందాడై చేసిన కూచిపూడి నృత్యం జర్మన్లను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ వేడుక విజయవంతం కావడంలో వశిష్ట, ఋత్విక్, హర్ష, సంజయ్, దినేష్, నీలేశ్ కీలక పాత్ర పోషించారు. వచ్చే ఏడాది 350 మందితో ఇంకా భారీ ర్యాలీ నిర్వహిస్తామని అరుణ్ గున్నాల ప్రకటించారు. ఇకపై ప్రతి సంవత్సరం గణేశ్ ఉత్సవాలకు సహకారం అందిస్తామని ఖామ్ సిటీ అధికారులు హామీ ఇచ్చారు.

# వెయ్యి మందిని మింగిన మట్టి



**కైరో:** అంతర్యుద్ధంతో తల్లడిల్లుతున్న ఆఫ్రికా దేశం సూడాన్‌లో ఘోర ప్రకృతి విపత్తు చోటుచేసుకుంది. డార్ఫుర్‌రీజియన్‌లోని మర్రాహ్ పర్వతాల్లో ఆదివారం ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడటంతో తరసిన్ అనే గ్రామం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఈ విపత్తులో వెయ్యిమందికి పైగా సజీవ సమాధి అయినట్లు ఆ ప్రాంతంలో అధికారంలో ఉన్న సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఆర్మీ ప్రకటించింది. ఈ ఘోర ప్రమాదం నుంచి ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడినట్లు వెల్లడించింది. తరసిన్ గ్రామం మర్రాహ్ పర్వతాల్లో 3000 మీటర్ల ఎత్తులో ఉంది. కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారీస్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రాంతం సూడాన్ రాజధాని ఖార్టోమ్‌కు 900 కిలోమీటర్ల దూరంలో ఉంది. మృతదేహాలను వెలికితీసేందుకు సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఆర్మీ అంతర్జాతీయ సాయం కోరింది.

**మరుభూమిగా ప్రపంచ వారసత్వ ప్రాంతం**

మర్రాహ్ పర్వతాలను యూనిసెఫ్ గతంలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఎత్తయిన ఈ పర్వతాల్లో చల్లని వాతావరణంతోపాటు భారీ వర్షాలు కురుస్తుంటాయి. ఇవన్నీ పురాతన అగ్నిపర్వత ప్రాంతాలు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరు. సూడాన్‌లో 2023 ఏప్రిల్ నుంచి సైన్యానికి, పారామిలిటరీ దళమైన ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు మధ్య భీకర యుద్ధం జరుగుతోంది. దీంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి భారీగా వలస వెళ్లారు. తీవ్ర కరువు కారణంగా ఈ ప్రాంతంలో ప్రజలు గడ్డి తిని బతుకుతున్నారని కొన్నాళ్ల క్రితమే ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తంచేసింది. యుద్ధం కారణంగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఐరాస కార్యకలాపాలు కూడా నిర్వహించటం లేదు. దీంతో తక్షణ సాయం అందించటం సాధ్యం కావటం లేదని సూడాన్ అధికార వర్గాలు తెలిపాయి. కొండలపై నుంచి మట్టి, రాళ్లు భారీ మొత్తంలో జారిపడటంతో తరసిన్ గ్రామం చాలా లోతులో కూరుకుపోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. అక్కడ ఒక గ్రామం ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించటం లేదు. ఇటీవలి కాలంలో సూడాన్‌లో అతిపెద్ద ప్రకృతి విపత్తుల్లో ఇదీ ఒకటిగా నిలిచింది.

# భారత్‌కు ట్రంప్ మరోసారి భారీ షాక్!



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు మరో భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఉత్పత్తుల విభాగంలో 50శాతం టారిఫ్‌ను విధించారు. ఇప్పుడు అదే బాటలో సేవల విభాగంపై టారిఫ్‌లు విధించేందుకు సిద్ధమైంది. వాణిజ్య పరంగా భారత్‌పై మరింత ఒత్తిడి తెచ్చేలా ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే భారత ఎగుమతులపై భారీ సుంకాలు విధించిన ట్రంప్ ప్రభుత్వం, ఇప్పుడు భారత ఐటీ సేవలు, విదేశీ రిమోట్ వర్కర్లపై సుంకాలు విధించనుంది. అందుకు ఊతం ఇచ్చేలా అమెరికా ట్రేడ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సలహాదారు పీటర్ నవారూ.. అన్ని ఔట్‌సోర్సింగ్ సేవలపై టారిఫ్ విధించాలి' అనే అభిప్రాయం వ్యక్తం చేయడం అందుకు బలం చేకూర్చుతోంది. దీంతో విదేశీ సేవలపై కూడా వస్తువుల్లాగే టారిఫ్ విధించాలి అనే ఆలోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విధానాలు అమలైతే అమెరికా కంపెనీలు ఔట్‌సోర్సింగ్ ఖర్చులు పెరగడంతో.. భారత్ సంబంధిత కంపెనీలతో కుదుర్చుకునే కాంట్రాక్ట్‌ల విషయంలో వెనక్కితగ్గుతాయి. ప్రాజెక్టుల ఆలస్యం, లాభాల తగ్గుదల, సరఫరా గొలుసుల అంతరాయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. భారత ఐటీ కంపెనీలు అమెరికా ఆధారిత వ్యాపారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఇంజినీర్లు, కోడర్లు, ఐటీ కన్సల్టెంట్లు, విద్యార్థులు ఎక్కువ మంది వెళుతుంటారు. ఇన్ఫోసిస్,టీసీఎస్,విప్రో,హెచ్‌సీఎల్ వంటి సంస్థలు హెచ్ 1బీ వీసాల ప్రధాన స్పాన్సర్లు. ఈ వీసాల ద్వారా అమెరికాలో పనిచేసే అవకాశం లభిస్తుంది. కానీ ఇప్పుడు..హెచ్ 1బీ వీసా వ్యవస్థను పునరుద్ధరించేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ పరిణామాలు భారత్ తన ఐటీ రంగాన్ని విస్తరించేందుకు,వివిధ దేశాలతో వ్యాపార సంబంధాలు పెంచేందుకు, అమెరికా ఆధారాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. ట్రంప్ పాలనలో భారత ఐటీ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తులో ప్రపంచ వాణిజ్య దృశ్యాన్ని మలుపు తిప్పే అవకాశం కలిగి ఉన్నాయి.

# స్నేహబంధం బలోపేతం



**బీజింగ్:** అమెరికా విసిరిన టారిఫ్‌ల సవాళ్లతో ఇక్కట్లు ఎదురవుతున్న వేళ చైనా, రష్యా తమ చిరకాల స్నేహబంధాన్ని మరింత బలపరుచుకుంటున్నాయి. చైనాలోని తియాంజిన్‌లో సోమవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు జరిగిన మర్నాడే ఇరు దేశాలు మంగళవారం మరోసారి సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టాయి. పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. చర్చల కోసం రాజధాని బీజింగ్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సాదర స్వాగతం పలికారు. పుతిన్‌ను 'చిరకాల మిత్రుని'గా అభివర్ణించారు. పుతిన్ సైతం తన ప్రసంగంలో జిన్‌పింగ్‌ను ప్రియ స్నేహితునిగా సంబోధించారు. 'నాడు మేము కలిసే ఉన్నాం.. ఇప్పుడు కూడా కలిసే ఉంటాం'అని పుతిన్ చెప్పుకొచ్చారు. ఇరు దేశాధినేతల లాంఛన సమావేశం అనంతరం చైనా అధికార కేంద్ర స్థానమైన ఝోంగన్‌హాయ్‌లో ఇరుపక్షాల ఉన్నతాధికారుల మధ్య తేనీటి విందు భేటీ జరిగింది. రష్యా పర్యాటకులకు ఈ నెల నుంచి 30 రోజులపాటు వీసారహిత సదుపాయం కల్పించనున్నట్లు చైనా ప్రకటించింది. అలాగే చైనాకు మరో సహజవాయు పైప్‌లైన్‌ను నిర్మించేందుకు ఆ దేశంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు రష్యా ప్రభుత్వరంగ చమురు సంస్థ గాజ్‌ప్రోం సీఈఓ అలెక్సీ మిల్లర్ తెలిపారు. ప్రస్తుత పైప్‌లైన్ మార్గాల ద్వారా సహజవాయు సరఫరాను మరింత పెంచేందుకు కూడా ఒప్పందాలు చేసుకున్నాయి.

# లండన్‌లో గణేష్ నిమజ్జనం



**లండన్, మహా :** బ్రిటన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం ఎసెక్స్ నగరంలో ఈ ప్రమాదం జరిగింది. వినాయక చవితి పండగ నేపథ్యంలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసి వీరంతా తిరిగి వస్తుండగా రెండు కార్లు ఢీకున్నాయి. దీంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. మృతులను గుర్తించామన్నారు. మృతులు..నాదర్‌గుల్ వాసి తర్రె చైతన్య (23), బోడుప్పల్‌కు చెందిన రాపోలు రిషితేజా (21) అని వివరించారు. బిటెక్ పూర్తి చేసిన చైతన్య.. మాస్టర్ డిగ్రీ చేసేందుకు ఎనిమిది నెలల క్రితం లండన్ వచ్చాడని చెప్పారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అతడు అక్కడికక్కడే మృతి చెందారన్నారు. అయితే రిషి తేజా మాత్రం తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని చెప్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు రాయల్ లండన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన గౌతమ్ రావుల, నూతన్ తాటికాయలలు పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన కార్లను డ్రైవ్ చేస్తున్న.. గోపిచంద్ బి, మనోహర్ ఎస్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు చెప్పారు. మరోవైపు ఈ ఇద్దరు విద్యార్థుల మృతితో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకొన్నాయి. వీరి మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయా కుటుంబ సభ్యులు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాయి..



## మూడంకెల మార్క్ దాటేసిన
# కొత్త లోక

హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అనగానే చాలామంది ప్రేక్షకులకు చిన్నచూపు. హా ఏముందిలే అని అనుకుంటారు. కానీ అప్పట్లోనే విజయశాంతి లాంటి హీరోయిన్స్.. 'కర్తవ్యం' లాంటి సినిమాలు చేశారు. బాగానే గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ తర్వాత కాలంలో హీరోలు, కమర్షియల్ చిత్రాల హవా పెరిగేసరికి ఫిమేల్ సెంట్రిక్ మూవీస్ రావడం బాగా తగ్గిపోయింది. కానీ గత దశాబ్ద కాలంలో మాత్రం దక్షిణాదిలో అడపాదడపా వస్తూనే ఉన్నాయి. గత కొన్నేళ్లలో హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్ అనగానే అనుష్క గుర్తొస్తుంది. 'అరుంధతి'తో ట్రెండ్ సెట్ చేసిన ఈ బ్యూటీ.. తర్వాత రుద్రమదేవి, భాగమతి తదతరత చిత్రాలతో తన సకెస్స్‌ని కొనసాగించింది. తర్వాత కాలంలో పలువురు సౌత్ హీరోయిన్లు.. ఫిమేల్ సెంట్రిక్ మూవీస్ తీసినప్పటికీ అనుష్క దరిదాపుల్లోకి చేరుకోలేకపోయారు. కానీ 'మహానటి' మూవీతో కీర్తి సురేశ్ ఆ ఫీట్ సాధించింది. ఈ మూవీకి ఏకంగా రూ.84 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయి.

2018లో 'మహానటి' రాగా ఆ రికార్డ్ అలానే ఉంటూ వచ్చింది. కానీ ఇప్పుడు 'కొత్త లోక' సినిమా సరికొత్త రికార్డ్స్ సృష్టిస్తోంది. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం.. రిలీజైన 7 రోజుల్లోనే రూ.100 కోట్ల కలెక్షన్ మార్క్ అందుకుంది. సాధారణంగా చూస్తే ఇదేమంత ఎక్కువ మొత్తంలా అనిపించకపోవచ్చు. కానీ మిడ్ రేంజ్ హీరోయిన్ అయిన కల్యాణి ప్రియదర్శన్‌ని లీడ్ రోల్‌లో పెట్టి తీసిన సూపర్ హీరో సినిమాకు ఈ రేంజ్ వసూళ్లు అంటే కచ్చితంగా విశేషమే. ఇప్పటికే లాభాల్లోకి వెళ్లిపోయిన 'కొత్త లోక'.. ఇప్పుడు రూ.100 కోట్ల మార్క్ కూడా దాటేసినట్లు తెలుస్తోంది. తద్వారా మహానటి, రుద్రమదేవి, భాగమతి, అరుంధతి చిత్రాల కంటే ఎక్కువ వసూళ్లు సాధించిన సౌత్ ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీగా నిలిచింది. థియేట్రికల్ రన్ పూర్తయ్యేసరికి ఇది ఇంకెన్ని కోట్లు కలెక్ట్ చేస్తుందో చూడాలి?



# ప్రభాస్ ఈసారి డిఫరెంట్‌గా..

ప్రభాస్ చేతిలో మూడు నాలుగు సినిమాలున్నాయి. ప్రస్తుతం 'రాజాసాబ్' పూర్తి చేసే బిజీలో ఉన్నాడు. అలానే 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్) షూటింగ్ కూడా మరోవైపు జరుగుతోంది. ఇది కాకుండా లైన్‌లో 'స్పిరిట్', 'సలార్ 2', 'కల్కి 2' ఉన్నాయి. ఈ మూడింటి షూటింగ్స్ మొదలు కావాల్సి ఉంది. సలార్, కల్కి సీక్వెల్స్ తీయడానికి ఇంకా సమయముంది. 'స్పిరిట్' గురించి ఇప్పుడు సరికొత్త రూమర్స్ వినిపిస్తున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత సందీప్ రెడ్డి వంగా తీస్తున్న సినిమా 'స్పిరిట్'. ఇందులో ప్రభాస్ హీరోగా నటిస్తాడు. పవర్ ఫుల్ పోలీస్ లుక్ ఉండబోతుందని చాన్నాళ్ల క్రితమే ప్రకటించారు. హీరోయిన్‌గా తొలుత దీపిక పదుకొణెని అనుకున్నారు కానీ చివరకు తృప్తి దిమ్రి వచ్చి చేరింది. చాన్నాళ్లుగా ఈ ప్రాజెక్ట్ పెండింగ్‌లో ఉంది. అయితే ఈ మూవీ కథేంటి? జానర్ ఏంటి? అనే విషయాలు ఇప్పటివరకు వినిపించలేదు. కానీ ఇప్పుడు సడన్‌గా 'స్పిరిట్' గురించి సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది. డార్క్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రాన్ని తీయబోతున్నారని సమాచారం. ఈ సినిమాకు కేవలం ఆరు నెలల్లో పూర్తి చేసేలా సందీప్ ప్లాన్ చేశాడని, గత మూవీస్‌తో పోలిస్తే ప్రభాస్ బరువు తగ్గి, డిఫరెంట్ లుక్‌లో కనిపించబోతున్నాడని మాట్లాడుకుంటున్నారు. ఇందులో నిజానిజాలు సంగతి పక్కనబెడితే రూమర్స్ మాత్రం మంచి ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తున్నాయి. ఒకవేళ ఇవి గనక నిజమైతే మాత్రం అంచనాలు పెరగడం గ్యారంటీ.

# ఆనంద నిలయంలో..?

హీరో వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాలోని నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట త్రివిక్రమ్. కథ రీత్యా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని, ఒక హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని సంప్రదించారని సమాచారం. కథానాయికగా ఆమె దాదాపు ఖరారు అయ్యారట. ఇక వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు 'వెంకటరమణ: కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్‌ను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి... ఆనంద నిలయంలో 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి భాగం అయ్యారా? వేచి చూడాల్సిందే.



# ఆ వెబ్‌సైట్లలో నా ఫొటోలు చూసి షాకయ్యా: హీరోయిన్

అనుమతి లేకుండా తన ఫొటోలను వాడుకున్న ఇకామర్స్ వెబ్‌సైట్లకు హీరోయిన్ సోనాక్షి సిన్హా గట్టి వార్నింగ్ ఇచ్చింది. వెంటనే వాటిని డిలీట్ చేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సోషల్ మీడియా వేదికగా హెచ్చరికలు జారీ చేసింది. ఎక్కువగా ఆన్‌లైన్ షాపింగ్ చేసే సోనాక్షి.. కొన్ని బ్రాండెడ్ వెబ్‌సైట్లలో తన ఫొటోలను చూసి ఆశ్చర్యపోయానని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది. 'నేను ఎక్కువగా ఆన్‌లైన్‌లోనే షాపింగ్ చేస్తుంటాను. ఒక నటిగా కొత్త కొత్త దుస్తులు, ఆభరణాలు ధరిస్తుంటాను.అలాంటప్పుడు ఆ డ్రెస్ వివరాలు దాని బ్రాండ్‌కు క్రెడిట్ ఇస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాను. అంతమాత్రనా నా ఫొటోలను మీ వెబ్‌సైట్లలో వాడుకోవడం ఎంతవరకు ఆమోదయోగ్యం? నన్ను సంప్రదించకుండా, నా అనుమతి లేకుండా నా ఫొటోలను ఎలా ఉపయోగించుకుంటారు? నైతిక బాధ్యత వహించరా? ఇలా చేయడం సరైన పద్ధతి కాదు. నేను మీ వివరాలను వెల్లడించకముందే నా ఫొటోలను తొలగించండి. లేదంటే.. చట్టపరమైన చర్యలు తప్పవు' అని సోనాక్షి వార్నింగ్ ఇచ్చింది. గతంలో అనుష్క శర్మ, అమితాబ్ బచ్చన్ కూడా అనుమతి లేకుండా పలు కంపెనీలు తమ ఫొటోలను ఉపయోగించడాన్ని విమర్శించారు. సోనాక్షి కెరీర్ విషయానికొస్తే.. ఆ మధ్య 'హీరామండీ' వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించింది. ఆమె నటించిన తాజా చిత్రం 'నికితా రాయ్' ఇటీవల రిలీజై మంచి టాక్‌ని సంపాదించుకుంది.



OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com